RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: HYDERABAD | సంపుటి: 10 | సంచిక: 168 | బుధవారం,08, జనవరి, 2025 | ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ | అసోసియేట్ ఎడిటర్: కే రాజేంద్ర ప్రసాద్ | పేజీలు: 08 వెల: 2 రూ/-

## బ్యాంకులదే పూర్తి బాధ్యత

**మోసపూరిత లావాదేవీలకు పరిహారం ఇవ్వాలి**
**సుప్రీంకోర్టు కీలక తీర్పు**
**నేరం జరిగిన మూడు రోజుల్లోగా ఫిర్యాదు చేస్తేనే ఈ ఊరట**
**ఎస్‌బీఐ రూ.94 వేలు చెల్లించాలి**
**గువాహటి బాధితుడి కేసులో సుప్రీంకోర్టు ఆదేశాలు**

కస్టమర్ కేర్ మోసాలు.. మాల్‌వేర్‌తో ఖాతాలను ఖాళీ చేసే సైబర్ నేరాల విషయంలో బాధితులకు ఊరట కలిగించేలా సుప్రీంకోర్టు కీలక తీర్పునిచ్చింది.





## దేశంలో ఏడుకు చేరిన హెచ్‌ఎంపీవీ కేసులు

దేశంలో మరో రెండు హ్యూమన్ మెటా న్యూమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం కేసుల సంఖ్య ఏడుకు పెరిగింది. మంగళవారం నాగ్‌పూర్‌లో ఇద్దరికి ఈ వైరస్ సోకినట్టు గుర్తించారు. ఇంతవరకు బెంగళూరులో రెండు, సేలం, అహ్మదాబాద్, చెన్నైల్లో ఒక్కొక్క కేసు వంతున నమోదయింది. బాధితులంతా మూడు నెలల నుంచి 13 ఏళ్లలోపు ఉన్న పిల్లలే. ఇది కొత్త వైరస్ ఏమీ కాదని, 2001లోనే గుర్తించారని ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రణదీప్ గులేరియా చెప్పారు. ఫ్లూ లక్షణాలతో ఉన్న జ్వరం వస్తుందని, దీనికి ఎలాంటి యాంటీ బయోటిక్స్ వాడాల్సిన పనిలేదని తెలిపారు. తగినన్ని నీళ్లు తాగాలని,




పారాసిటమాల్ మాత్రలు, జ్వరం, వళ్లు నొప్పులు నివారించే మందులతో ఇది తగ్గుతుందని తెలిపారు.

## అండగా ఉంటా!



- వైద్య ఖర్చులన్నీ భరిస్తా..
- మీకు జరగరాని నష్టం జరిగింది
- శ్రీతేజ తండ్రి భాస్కర్‌తో హీరో అల్లు అర్జున్
- కిమ్స్‌కు వెళ్లి బాలుడిని పరామర్శించిన సినీ నటుడు
- ఆరోగ్య పరిస్థితిపై వాకబు..
- 20 నిమిషాలు ఆస్పత్రి వద్దే
- పోలీసులకు ముందే సమాచారం..
- ఆస్పత్రి వద్ద బందోబస్తు

'మీకు జరగరాని నష్టం జరిగింది...మీకు అండగా నేనుంటా. ఇలా జరుగుతుందని అనుకులేదు. బాబు పూర్తిగా కోలుకునే దాకా బాధ్యత నాదే. వైద్య చికిత్సకు అయ్యే ఖర్చులన్నీ భరిస్తాను' అని శ్రీతేజ తండ్రి భాస్కర్‌తో సినీ నటుడు అల్లు అర్జున్ అన్నారు. మంగళవారం ఉదయం పది గంటలకు అల్లు అర్జున్ కిమ్స్ ఆస్పత్రికి వచ్చారు. అక్కడ చికిత్స పొందుతున్న శ్రీతేజను ఆయన పరామర్శించారు.


## అరెస్టుకు వేళాయెనా..?

- నిధుల దుర్వినియోగం కనిపిస్తోందన్న హైకోర్టు..
- కేటీఆర్ క్వాష్ పిటిషన్ కొట్టివేత
- ఫార్ములా-ఈ.. రేపు ఏసీబీ విచారణకు కేటీఆర్
- ఆయన అరెస్టుకు మార్గం సుగమం!
- నేడు హాజరవనున్న అర్వింద్‌కుమార్
- లాయర్ల సమక్షంలోనే విచారణ జరగాలి
- నేడు హైకోర్టులో కేటీఆర్ పిటిషన్
- గ్రీన్ కో కార్యాలయాలకు ఏసీబీ
- హైదరాబాద్, మచిలీపట్నంలో తనిఖీలు
- కీలక రికార్డుల స్వాధీనం! ఏసీబీ ఆఫీసుకు బంజారాహిల్స్ పోలీసులు..
- 16న విచారణకు రండి.. కేటీఆర్‌కు ఈడీ సమన్లు



ఫార్ములా–ఈ కారు రేసు కేసు విచారణలో అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) అధికారులు దూకుడు పెంచారు. కేటీఆర్ విచారణకు సంబంధించి అన్ని రకాల డాక్యుమెంట్లను సేకరిస్తున్నారు. కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను కొట్టివేయడంతో పాటు కేసులో దర్యాప్తు కొనసాగించవచ్చని హైకోర్టు స్పష్టం చేయడంతో ఆయన అరెస్టుకు మార్గం సుగమమైనట్లేనని భావిస్తున్నారు. గురువారం కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరు కావాల్సి ఉండడంతో బీఆర్ఎస్ నేతలు తమ లీగల్ టీంతో చర్చలు జరిపారు. తదుపరి కార్యాచరణపై చర్చించారు. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ కేటీఆర్ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయగా.. దానిపై రాష్ట్ర ప్రభుత్వం కేవియట్ దాఖలు చేసింది. దీంతో ఆయనకు అరెస్టు నుంచి రక్షణ లభించకపోవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ఫార్ములా–ఈ రేసు తొలి ఒప్పందంలో స్పాన్సరర్‌గా ఉన్న ఏస్ నెక్ట్స్‌జెన్, దాని మాతృ సంస్థ గ్రీన్ కో కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు మంగళవారం సోదాలు చేశారు. ఏపీ, తెలంగాణలో మొత్తం ఆరు చోట్ల ఏసీబీ బృందాలు సోదాలు చేశాయి. హైదరాబాద్‌లోని మాదాపూర్, జూబ్లీహిల్స్‌లోబీ మచిలీపట్నంలోని కార్యాలయాల్లో అధికారులు సోదాలు నిర్వహించారు. మచిలీపట్నంలోని గ్రీన్‌కో సంస్థ ఎండీ చలమలశెట్టి సునీల్ ఇంట్లో గ్రీన్‌కో, ఏస్ నెక్ట్స్ జెన్ కార్యాలయాలను నడుపుతున్నారు. స్థానిక పోలీసులకు సైతం సమాచారం ఇవ్వకుండా తెలంగాణ ఏసీబీ అధికారులు ఈ కార్యాలయంలోకి వెళ్లారు.

## దాడి.. ప్రతిదాడి!



- బీజేపీ కార్యాలయంపై దాడికి యూత్ కాంగ్రెస్ నేతల యత్నం
- అడ్డుకున్న బీజేపీ కార్యకర్తలు.. ఇరువర్గాల మధ్య తీవ్రఘర్షణ..
- రాళ్లు, కోడిగుడ్లు విసురుకుని కొట్టుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తం
- దాడికి ప్రతిగా కాంగ్రెస్ ఆఫీసు ముట్టడికి బీజేపీ నేతల యత్నం..
- ఇరుపార్టీల నేతలపై కేసులు.. 8 మంది కాంగ్రెస్ కార్యకర్తల అరెస్ట్
- దాడి.. పిరికిపంద చర్య: కిషన్ రెడ్డి
- మా కార్యకర్తలు తల్చుకుంటే గాంధీ భవన్
- పునాదులు కూడా మిగలవ్: బండి సంజయ్
- ఎవరు ఎవరిపై దాడి చేసినా ఉపేక్షించం: భట్టి

ప్రియాంక గాంధీపై బీజేపీ మాజీ ఎంపీ రమేశ్ బిదూరీ అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ.. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు మంగళవారం మెరుపుదాడికి యత్నించారు. వారిని బీజేపీ కార్యకర్తలు అడ్డుకోవడంతో.. దాదాపు గంటన్నరపాటు ఇరు పార్టీల నాయకుల మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది.

### సంక్రాంతికి పోదాం..


## చలో చలో!

- 7,200 ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు
- నేటి నుంచి పండగకు వచ్చి వెళ్లేలా ఏర్పాటు
- ప్రత్యేక బస్సుల్లో అదనపు చార్జీలు ఉండవు
- ఆర్టీసీ ఎండీ తిరుమలరావు స్పష్టీకరణ
- తెలుగు రాష్ట్రాల మధ్య ప్రత్యేక రైళ్లు




సంక్రాంతి పండగకు ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని 7,200 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఏపీఎసఆర్టీసీ తెలిపింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు హైదరాబాద్‌తోపాటు బెంగళూరు, చెన్నై నుంచి అదనపు సర్వీసులు అందుబాటులో ఉంటాయని ఆర్టీసీ ఇన్‌చార్జి ఎండీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. ఈ నెల 8 నుంచి 13వ తేదీ వరకూ పొరుగు రాష్ట్రాల నుంచి ఏపీకి వచ్చేందుకు.. అదేవిధంగా తిరిగి 16 నుంచి 20వ తేదీ వరకు తిరుగు ప్రయాణానికి ఈ బస్సులు అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. ప్రత్యేక బస్సుల్లో ఎలాంటి అదనపు చార్జీలు ఉండబోవని, పండగకు వచ్చే ప్రయాణికులు ఒకేసారి తిరుగు ప్రయాణ

## రూ.25,700 కోట్ల పెట్టుబడులు




- భారతదేశంలో కృత్రిమ మేధ (ఏఐ)
- ,క్లౌడ్ కంప్యూటింగ్ సామర్థ్యాల విస్తరణకు
- కొత్త డేటా సెంటర్ల ఏర్పాటుకు
- భారత్‌లో మైక్రోసాఫ్ట్ పెట్టుబడులు
- కృత్రిమ మేధ, క్లౌడ్ ఇన్‌ఫ్రా విస్తరణకు ఖర్చు పెడతాం
- 2030 నాటికి కోటి మందికి ఏఐ నైపుణ్య శిక్షణ
- 'ఎడ్వాంటైజ్ ఇండియా' రెండో విడతలో భాగంగా..
- ఏఐ ఆవిష్కరణల రంగంలో భారత్ లీడర్‌గా
- ఎదుగుతోంది: మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల

భారతదేశంలో కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్ సామర్థ్యాల విస్తరణకు, కొత్త డేటా సెంటర్ల ఏర్పాటుకు, యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి.. 3 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.25,700 కోట్ల) పెట్టుబడులు పెట్టనున్నట్టు మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల ప్రకటించారు. అలాగే.. తాము చేపట్టిన 'ఎడ్వాంటైజ్ (అఈగఅరీఖీఅ(ఐ)ఎఉ) ఇండియా' కార్యక్రమం రెండో విడతలో భాగంగా వచ్చే ఐదేళ్లలో (2030 నాటికి) కోటి మంది భారతీయులకు ఏఐ నైపుణ్యాలకు సంబంధించిన శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. ఏఐ ఆవిష్కరణల విషయంలో భారత్ వేగంగా లీడర్‌గా ఎదుగుతోందని ఆయన కొనియాడారు. ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న ఆయన.. మంగళవారం బెంగళూరులో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఈ పెట్టుబడుల ప్రకటన చేశారు.

## నవ్యాంధ్రకు నవశకం

- రూ.2 లక్షల కోట్లకుపైగా భారీ ప్రాజెక్టులు
- నేడు విశాఖలో ప్రధాని మోదీ చేతుల మీదుగా శ్రీకారం
- గ్రీన్ హైడ్రోజన్ హబ్ విలువే రూ.1.85 లక్షల కోట్లు
- రోడ్డు, రైల్వే పనుల అంచనా రూ.19.5 వేలకోట్లు
- ఇంకా.. 10కిపైగా కీలక ప్రాజెక్టులకూ శంకుస్థాపన
- 6కు పైగా రోడ్లు, రైల్వే లైన్లు జాతికి అంకితం
- చంద్రబాబు, పవన్‌తో కలిసి బటన్ నొక్కనున్న పీఎం
- అభివృద్ధిలో ఏపీని మరోఎత్తుకు చేర్చేలా కార్యక్రమాలు
- కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక ఏపీకి తొలిసారి మోదీ
- ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో భారీ సభ
- వేదికపై ప్రధాని, గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం..
- విశాఖలో గడిపేందుకు ఎదురుచూస్తున్నా

"విశాఖపట్నం ప్రజల మధ్య గడిపేందుకు ఎదురుచూస్తున్నాను. నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌లో భాగంగా తొలి హబ్ అయిన ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ గ్రీన్ హైడ్రోజన్ హబ్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనుండటం చాలా సంతోషకరం. అనకాపల్లి జిల్లాలో భారీ ఔషధ పరిశ్రమ, తిరుపతి జిల్లాలోని చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో భాగమైన కృష్ణపట్నం పారిశ్రామిక ప్రాంతం (క్రిస్ సిటీ) శంకుస్థాపన కార్యక్రమాల్లో కూడా పాల్గొంటాను" - ప్రధాని నరేంద్ర మోదీ (ఎక్స్ సందేశం)



రాష్ట్రాభివృద్ధిలో కీలక ముందడుగు

"రాష్ట్రపర్యటనకు వస్తున్న ప్రధాని మోదీకిప్రజల తరఫున స్వాగతం పలుకుతున్నా. రూ.2లక్షల కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరగనుండటం రాష్ట్రాభివృద్ధిలో కీలక ముందడుగు. ప్రధానికి స్వయంగా స్వాగతం పలికేందుకు విశాఖ ప్రజలతో సహా అందరం ఎదురుచూస్తున్నాం" -సీఎం చంద్రబాబు (ఎక్స్ సందేశం)

# అరెస్టుకు వేళాయెనా..?

అక్కడ పనిచేసే సిబ్బందిని మినహా ఎవరినీ లోపలికి అనుమతించలేదు. కార్యాలయంలోని కీలక రికార్డులు, కంప్యూటర్లు, ల్యాప్‌టాపలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఫార్ములా-ఈ కారు రేసు కేసులో భాగంగానే గ్రీన్‌కో కార్యాలయాల్లో తనిఖీలు చేస్తున్నట్లు అధికారులు మచిలీపట్నంలో చెప్పారు. ప్రతి అంశాన్ని పరిశీలించి, ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని తెలిపారు.

**నేడు ఏసీబీ ముందుకు అర్వింద‌కుమార్..**

ఫార్ములా-ఈ కారు రేసు కేసుకు సంబంధించి కీలక వ్యవహారాలు చక్కదిద్దిన నాటి పురపాలకశాఖ ప్రత్యేక కార్యదర్శి అర్వింద‌కుమార్‌ను బుధవారం ఏసీబీ అధికారులు విచారించనున్నారు. కేటీఆర్‌ను విచారించడానికి ముందే అర్వింద‌కుమార్‌ను ప్రశ్నించడం వల్ల కేసు దర్యాప్తుకు సంబంధించిన కీలక అంశాలు బయటపడతాయని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు. ఎఫ్ఈఈవో, ఏస్ నెక్స్ట్‌జెన్, పురపాలక శాఖకు మధ్య జరిగిన త్రైపాక్షిక ఒప్పందం అమల్లో ఉండగా.. రెండోసారి స్పాన్సరర్‌ను తప్పించి పురపాలక శాఖ, ఎఫ్ఈఈవో ఎందుకు ఒప్పందం చేసుకోవాల్సి వచ్చింది? తొలి ఒప్పందంలో భాగంగా రెండో సెషన్‌కు స్పాన్సరర్ కంపెనీ ఫీజు చెల్లించాల్సి ఉండగా ఎవరి ఆదేశాలతో హెచ్ఎండీఏ నుంచి రూ.46 కోట్లు విదేశీ కరెన్సీలో చెల్లించారు? అనే విషయాలపై అర్వింద‌కుమార్ నుంచి వివరాలు సేకరించనున్నారు. ఈ కేసులో అప్రూవర్‌గా మారతానంటూ ఇప్పటికే ఆయన ప్రభుత్వానికి సమాచారం ఇచ్చిన క్రమంలో విచారణ తర్వాత అరెస్టు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. అప్పట్లో తెర ముందు, వెనక జరిగిన విషయాలు బయటపెడితే మాత్రం కేటీఆర్ అరెస్టు మరింత సులభం అవుతుంది. అర్వింద‌కుమార్ అప్రూవర్‌గా మారితే ఆయన బెయిల్ పిటిషన్‌పై ఏసీబీ అభ్యంతరాలు వ్యక్తం చేయకపోవచ్చు. ‘

**16న విచారణకు రండి: ఈడీ**

ఫార్ములా-ఈ కారు రేసుకు సంబంధించి ఫెమా నిబంధనల ఉల్లంఘన ప్రకారం దర్యాప్తు చేస్తున్న ఈడీ అధికారులు కేటీఆర్‌ను ఈ నెల 16న విచారణకు రావాలని తాజాగా సమన్లు జారీ చేశారు. ఈ కేసుకు సంబంధించి హెచ్ఎండీఏ మాజీ సీఈ బీఎల్ఎన్ రెడ్డిని బుధవారం ఈడీ అధికారులు విచారించనున్నారు. ఇప్పటికే ఒకసారి ఈడీ నుంచి సమయం కోరిన బీఎల్ఎన్ రెడ్డి, నేటి విచారణకు తప్పనిసరిగా హాజరు కావాల్సిందేనని, ఆయన మరోసారి సమయం కోరితే మాత్రం తదుపరి చట్టపరమైన చర్యలకు వెళ్లే అవకాశం ఉంటుందని తెలుస్తోంది.

న్యాయవాదిని అనుమతించకపోవడంపై హైకోర్టుకు..న్యాయవాదితో కలిసి ఏసీబీ విచారణకు అనుమతించకపోవడంపై బుధవారం హైకోర్టును ఆశ్రయించనున్నట్లు కేటీఆర్ తెలిపారు. తన విచారణ న్యాయవాదుల సమక్షంలో జరిగేలా చూడాలని కోరతానన్నారు.

**ఏసీబీ కార్యాలయానికి బంజారాహిల్స్ పోలీసులు..**

ఫార్ములా-ఈ కారు రేసు దర్యాప్తులో విచారణలు, అరెస్టులు ప్రారంభం కానున్న క్రమంలో బంజారాహిల్స్ సబ్ డివిజన్ పోలీసు అధికారులు మంగళవారం ఏసీబీ కార్యాలయానికి వచ్చారు. ఏసీబీ ఉన్నతాధికారుల నుంచి వారికి కొన్ని ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. కేటీఆర్ తదితరుల విచారణ సమయంలో బందోబస్తుపై, ఒకవేళ అరెస్టులు జరిగితే అవసరమైన ఎస్కార్టు గురించి ఏసీబీ నుంచి పోలీసులకు సూచనలు వచ్చినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ కమిషనర్‌తో కూడా ఏసీబీ ఉన్నతాధికారులు మాట్లాడినట్లు సమాచారం.

# రూ.25,700 కోట్ల పెట్టుబడులు

ఈ పెట్టుబడులు దేశవ్యాప్తంగా ఎంతో మంది ప్రజలకు, సంస్థలకు ఉపయోగపడతాయని సత్య నాదెళ్ల ఆశాభావం వ్యక్తం చేశారు. మనదేశంలో ప్రస్తుతం ఉన్న మైక్రోసాఫ్ట్ డేటా సెంటర్లకు అదనంగా మరొకటి 2026లో అందుబాటులోకి రానుంది. ఆయా డేటాసెంటర్ ప్రాంగణాల్లో క్లౌడ్, ఏఐ మౌలికసదుపాయాలను మైక్రోసాఫ్ట్ ఈ పెట్టుబడుల సాయంతో విస్తరించనుంది. దేశంలో నానాటికీ పెరుగుతున్న ఏఐ స్టార్టప్‌లు, పరిశోధకుల అవసరాలను తీర్చే ‘ఏఐ కంప్యూటింగ్ ఎకోసిస్టమ్’ను అభివృద్ధి చేయనుంది.

మనదేశంలోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ఏఐ ఇన్‌ఫ్రా, డేటాసెంటర్ల అభివృద్ధికి మైక్రోసాఫ్ట్ సంస్థ వందల కోట్ల డాలర్లు గుమ్మరిస్తోంది. ఈ ఒక్క ఏడాదిలోనే ఇలా 8000 కోట్ల డాలర్లు (దాదాపు రూ.6.8 లక్షల కోట్లు) ఖర్చు పెట్టేందుకు ప్రణాళికలు రచించింది. భారత్‌లో ఏఐ ఇన్నోవేషన్‌ను వేగవంతం చేయడం ద్వారా.. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా (వికసిత్ భారత్) మార్చాలన్న ప్రధాని మోదీ స్వప్నం సాకారం కావడానికి ఈ పెట్టుబడి ఉపయోగపడనుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. మైక్రోసాఫ్ట్ సంస్థ మనదేశంలో 2024లో ప్రారంభించిన ‘ఎడ్వాంటైజ్ ఇండియా’ పథకంలో భాగంగా.. ఏడాదిలో 20 లక్షల మందికి ఏఐ నైపుణ్యాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఏడాది ముగిసే సమయానికి ఆ అంచనాలను మించి.. 24 లక్షల మందికి శిక్షణ ఇవ్వగలిగింది. వారిలో 65 శాతం మంది మహిళలు కాగా.. 74శాతం మంది ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలవారే! ప్రపంచవ్యాప్తంగా ఏఐ నైపుణ్యాలను నేర్చుకుంటున్నవారిలో భారతీయ నిపుణులు ఎక్కువగా ఉంటున్నారని మైక్రోసాఫ్ట్ సంస్థ పేర్కొంది. ఈ క్రమంలోనే ‘ఎడ్వాంటైజ్ ఇండియా’ రెండో విడత పథకానికి శ్రీకారం చుట్టింది. ఆ దిశగా మైక్రోసాఫ్ట్ రిసెర్చ్ (ఎంఎస్ఆర్) ల్యాబ్ ఇప్పటికే ఏఐ ఇన్నోవేషన్ నెట్‌వర్క్ పేరుతో ఫిజిక్స్‌వాలా, రెమిడియో, సాఫ్ట్‌ఎక్స్ వంటి స్టార్టప్‌లతో ఒప్పందాలు కుదుర్చుకుంటోంది. దేశీయ భాషల్లో లాంగ్వేజ్ లెర్నింగ్ మోడల్స్ రూపొందించడం, ప్రాంప్ట్ ఆప్టిమైజేషన్ వంటివాటిలో శిక్షణ ఇస్తోంది.

# నవ్యాంధ్రకు నవశకం

**జాతికి అంకితం చేసేవి..**

1)ఎన్‌హెచ్-16లో చిలకలూరిపేట బైపాస్ ఆరు వరుసల రహదారి

2)ఎన్‌హెచ్-216 నుంచి రేపల్లె-ఈపూరుపాలెం సెక్షన్ రెండు వరుసల రహదారి

3)బత్తులపల్లి నుంచి ముదిగుబ్బ రోడ్ సెక్షన్‌లో నాలుగు వరుసల రహదారి.

4)బెజవాడ-గుడివాడ-భీమవరం, నర్సాపూర్, గుడివాడ-మచిలీపట్నం, భీమవరం-నిడదవోలు రైల్వే లైన్ డబ్లింగ్, ఎలక్ట్రిఫికేషన్

5)గుత్తి-ధర్మవరం వరకు రైల్వే లైన్ డబ్లింగ్

6)గిద్దలూరు నుంచి దిగువమెట్ట వరకు పూర్తయిన రైల్వే లైన్ డబ్లింగ్ ప్రాజెక్ట్.

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం విశాఖకు వస్తున్నారు. అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్‌ను మరో ఎత్తుకు చేర్చుతూ రూ.రెండు లక్షల కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడకలో ఏర్పాటుచేసే గ్రీన్ హైడ్రోజన్ హబ్ విలువే రూ.1.85లక్షల కోట్లు. రహదారులు, రైల్వే పనుల అంచనా రూ.19.5వేల కోట్లు. వీటితోపాటు మరో 10కిపైగా ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు.అలాగే.. కొత్తగా నిర్మించిన, విస్తరించిన ఆరు రహదారులు, రైల్వే లైన్లు జాతికి అంకితం చేస్తారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఆయన రాష్ట్రానికి రావడం ఇదే మొదటిసారి. ప్రధాని వెంట సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా ఈ పర్యటనలో పాల్గొంటున్నారు. ఈ మేరకు రాష్ట్ర యంత్రాంగం, పోలీసు విభాగాలను సీఎస్ విజయానంద్, డీజీపీ ద్వారకా తిరుమల రావు అప్రమత్తం చేశారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారు. ఈ మార్గంలోని రహదారిని ప్రత్యేక బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 1.5లక్షల మందిని సమీకరిస్తున్నారు. సభ వేదికపై మోదీతో పాటు గవర్నర్ అబ్దుల్ నజీర్, చంద్రబాబు, పవన్‌కల్యాణ్, కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, సత్యకుమార్, టీడీపీ రాష్ట్ర అ?ధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎలమంచిలి నియోజకవర్గ శాసనసభ్యుడు సుందరపు విజయకుమార్ ఉంటారు. ప్రధానికి కుడి వైపున గవర్నర్, ఎడమ వైపున ముఖ్యమంత్రికి సీట్లు కేటాయించారు. పవన్‌కల్యాణ్, చంద్రబాబు ప్రసంగించిన తరువాత ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల శిలాఫలకాలు ఆవిష్కరించినఅనంతరం ప్రసంగిస్తారు. ప్రధాని ప్రసంగాన్ని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు అనువదిస్తారు

**చిన్నపొరపాటు కూడా జరగొద్దు: సీఎస్, డీజీపీ**

ప్రధాని పర్యటనకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సీఎస్ విజయానంద్ ఆదేశించారు. మంగళవారం ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రధాని పర్యటనలో ఏ చిన్న పొరబాటుకూ ఆస్కారం లేకుండా పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలన్నారు. వాహనాల పార్కింగ్‌కు అవసరమైన చర్యలు తీసుకోవాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని, తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ వీసీలో డీజీపీ ద్వారకా తిరుమలరావు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఎస్పీజీ సమన్వయంతో పోలీస శాఖ కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. రోడ్ షో కోసం, సభ కోసం చేస్తున్న ఏర్పాట్లను విశాఖ జిల్లా కలెక్టర్ హరీంధర ప్రసాద్ వివరించారు.

**ఇంధన క్షేత్రంలో మైలురాయి.. గ్రీన్ హైడ్రోజన్ హబ్**

భారతదేశ గ్రీన్ ఎనర్జీ రంగంలో ముఖ్యమైన మైలురాయి గ్రీన్ హైడ్రోజన్ హబ్. ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్- న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎన్ఆర్ఈడీసీఏపీ) కలిసి దీనిని ఏర్పాటుచేస్తున్నాయి. బుధవారం ప్రధాని శంకుస్థాపన చేయనున్న ఈ ప్రాజెక్టుకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. ఇది ప్రభుత్వ రంగంలోనే మొట్టమొదటిది. ప్రాజెక్టు అభివృద్ధి ప్రణాళికలో భాగంగా 300ఎకరాల విస్తీర్ణంలో 25 పారిశ్రామిక మాన్యుఫాక్చరింగ్ యూనిట్లు, ఇంకో 300 ఎకరాల్లో యుటిలిటీస్, సౌకర్యాలు, లాజిస్టిక్స్, రోడ్లు, పారిశ్రామిక కేంద్రాలు, విద్యుత్తు, నీటి సౌకర్యం, డీశాలినేషన్ ప్లాంట్లు, ఓడరేవు తదితర మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. దీనిపై సీఎస్ విజయానంద్ మంగళవారం విద్యుత్తు వినియో గ సంస్థలతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

**శంకుస్థాపన చేసే ప్రాజెక్టులు..**

ప్రధాని మోదీ విశాఖ సభా వేదికగా 12కు పైగా ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ఆరుకు పైగా రహదారులను జాతికి అంకితం చేసే కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ పనుల విలువ దాదాపు రూ. రెండు లక్షల కోట్ల పైమాటే. వేదికపై కూటమి పార్టీల నేతలంతా కనిపించనున్నారు. సీఎం, డిప్యూటీ సీఎంతో పాటు ఐటీ శాఖ మంత్రి లోకేశ్, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంద్వేశరి పాల్గొననున్నారు.

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడకలో ఎన్‌టీపీసీ రూ.1.85 లక్షల కోట్లతో గ్రీన్ హైడ్రోజన్ హబ్ ఏర్పాటు. 57 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ ప్రాజెక్టును 1,600 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నారు.

- అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కుకు శంకుస్థాపన.
- కృష్ణపట్నానికి సంబంధించిన ఇండస్ట్రియల్ నోడ్.
- విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయం నిర్మాణానికి శంకుస్థాపన.
- ఆదోని పట్టణం నుంచి ఎన్‌హెచ్-167ను కలుపుతూ బైపాస్ రహదారి
- కొండమోరు నుంచి పేరేచర్ల రహదారి విస్తరణ
- సంగమేశ్వరం నుంచి ఆత్మకూరు వరకు రహదారి విస్తరణ
- వేంపల్లి నుంచి చాగలమర్రి వరకు ఎన్‌హెచ్-440 నాలుగు లేన్లకు విస్తరణ
- ఎన్‌హెచ్-516 నుంచి పాడేరు బైపాస్ రహదారి నిర్మాణం
- గుంటూరు నుంచి బీబీ నగర్ వరకు రైల్వే లైన్ డబ్లింగ్
- మహబూబ్ నగర్ నుంచి కర్నూల్ మీదుగా డోన్ రైల్వే లైన్ డబ్లింగ్
- గుత్తి-పెండేకల్లు రైల్వే లైన్ డబ్లింగ్.
- రూ.19,500 కోట్ల విలువైన రహదారులు, రైల్వే ప్రాజెక్టులు.. ఇంకా ఇతర ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారు.

**షెడ్యూల్ ఇలా..**

బుధవారం సాయంత్రం 4.15 గంటలకు ప్రధాని మోదీ విశాఖకు చేరుకుంటారు. సాయంత్రం 4.45 గంటల నుంచి 5.30 గంటల వరకు వెంకటాద్రి వంటిల్లు రెస్టారెంట్ ప్రాంతం నుంచి సుమారు కిలోమీటరు మేర రోడ్డు షోలో పాల్గొంటారు. సాయంత్రం 5.30 నుంచి 6.45 వరకూ ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా వేదిక వద్ద నుంచి వర్చువల్‌గా పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. అనంతరం సభలో మాట్లాడతారు. సాయంత్రం 6.50 గంటలకు సభా వేదిక నుంచి బయలుదేరి విమానాశ్రయానికి చేరుకుని 7.15 గంటలకు భువనేశ్వర్‌కు బయలుదేరి వెళతారు.

# దాడి.. ప్రతిదాడి!

ఈ దాడికి ప్రతిగా.. బీజేపీ శ్రేణులు కూడా గాంధీభవన్ వరకు వెళ్లడంతో రెండుచోట్లా కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం పన్నెండు నుంచి పన్నెండున్నర గంటల సమయంలో సుమారు 40 మంది కాంగ్రెస్ కార్యకర్తలు, మరో నాలుగు వాహనాలపై మరి కొంతమంది నాయకులు బీజేపీ ఆఫీసు వద్దకు వచ్చారు. లోపలికి దూసుకుపోవడానికి ప్రయత్నించారు. పోలీసుల సమక్షంలోనే బారికేడ్లను తొలగించి కొందరు అవతలివైపు దూకారు. కార్యాలయంపై రాళ్లు, కోడిగుడ్లు విసిరారు. బీజేపీ కార్యకర్తలు, నాయకులు వారిని అడ్డుకోవడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరు పార్టీల నేతలు ఆగ్రహంతో ఊగిపోతూ పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. ఫ్లెక్సీలు చింపేశారు. తోపులాటలు, దూషణలతో అక్కడ పరిస్థితి రణరంగంగా మారింది. నిరసనకారులు ప్రధాని నరేంద్రమోదీకి, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యాలయం లోపల ఉన్న బీజేపీ నాయకులకు గాయాలయ్యాయి. ముగ్గురు సెక్యూరిటీ గార్డులు, పలువురు బీజేపీ నేతలతోపాటు. అబిడ్స్ ఇన్‌స్పెక్టర్‌కు గాయాలయ్యాయి.

**కాంగ్రెస్ కార్యాలయంపైకి..**

తమ పార్టీ ఆఫీసుపై కాంగ్రెస్ నేతల దాడిని నిరసిస్తూ.. 30-40 మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు కొందరు గాంధీభవన్ ముట్టడికి బయల్దేరారు. అడ్డుకున్న పోలీసులను తోసేసి అక్కడికి చేరుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి, రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు నచ్చజెప్పినా వినలేదు. దీంతో భద్రతా బలగాలు నాలుగువైపులా వారిని చుట్టుముట్టి బలవంతంగా ఈడ్చుకెళ్లి వ్యాన్‌లోకి ఎక్కించారు. బైక్‌లపై గాంధీభవన్ వైపు వెళ్లేందుకు యత్నించిన పలువురు కార్యకర్తలను కూడా పోలీసులు మధ్యలోనే అడ్డుకున్నారు. కాగా.. కాంగ్రెస్ నేతల దాడిలో గాయపడిన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లును నాంపల్లి కేర్ ఆస్పత్రికి తరలించారు. ఆయన్ను పరామర్శించిన ఎంపీ ఈటల రాజేందర్.. ఆయన తలకు బలమైన గాయం అయిందని తెలిపారు. కాగా.. బీజేపీ కార్యాలయ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అబిడ్స్ పోలీసులు మంగళవారం రాత్రి 8 గంటల సమయానికి ఎనిమిది మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడిలో 40 నుంచి 60 మంది వరకు పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయం చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నామని, మరింత మందిని అదుపులోకి తీసుకుంటామని అబిడ్స్ పోలీసులు పేర్కొన్నారు. మరోవైపు.. గాంధీభవన్‌ను ముట్టడించేందుకు ప్రయత్నించిన బీజేపీ నేతలపై బేగంబజార్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇరుపార్టీల పరస్పర దాడుల నేపథ్యంలో నాంపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయిపోయింది. ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. కాగా.. ఈ దాడులను అంచనా వేయడంలో స్పెషల్ బ్రాంచ్ అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

## సంక్రాంతికి పోదాం..

# చలో చలో!

టికెట్ కూడా రిజర్వేషన్ చేసుకుంటే.. చార్జీలో 10 శాతం రాయితీ ఉంటుందన్నారు. బుధవారం నుంచి ఈ నెల 13 వరకూ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు ఆర్టీసీ 3,900 బస్సులు నడుపుతోంది. హైదరాబాద్ నుంచి ఏపీలోని పలు ప్రాంతాలకు 2,153 ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉన్నాయి. అదేవిధంగా బెంగళూరు నుంచి 375, విజయవాడ నుంచి 300, విశాఖపట్నం 250, రాజమహేంద్రవరం 230, తిరుపతి 50, చెన్నై నుంచి 42 అదనపు బస్సులు నడుపుతున్నట్లు ఏపీఎస‌ఆర్టీసీ వివరించింది. సంక్రాంతి తర్వాత తిరుగు ప్రయాణానికి జనవరి 16 నుంచి 20 వరకు 3,300 బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపింది. రాష్ట్రంలోనే పెద్ద పండగ అయిన సంక్రాంతికి నగరాలు, పట్టణాల నుంచి సొంతూళ్లకు వెళ్లేందుకు లక్షలాది మంది సిద్ధమవుతున్నారు. ఎలాంటి అదనపు చార్జీల్లేకుండా సురక్షితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసి గమ్యం చేరాలని వారిని ఆర్టీసీ కోరింది. ఆన్‌లైన్ ద్వారా ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపింది. కాల్ సెంటర్ నెంబర్ 149 లేదా 0866-2570005 నెంబర్లకు ఫోన్ చేయవచ్చని సూచించింది.

**తెలుగు రాష్ట్రాల మధ్య ప్రత్యేక రైళ్లు**

సంక్రాంతి సందర్భంగా దక్షిణమధ్య రైల్వే తెలుగు రాష్ట్రాల మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతోంది. సికింద్రాబాద్, కాచిగూడ, చర్లపల్లి రైల్వేస్టేషన్ల నుంచి కాకినాడ, నర్సాపురం, తిరుపతి, శ్రీకాకుళం ప్రాంతాలకు అదనపు ట్రైన్లు అందుబాటులో ఉన్నట్లు రైల్వే శాఖ తెలిపింది. ఈ నెల 11, 15 తేదీల్లో కాచిగూడ నుంచి శ్రీకాకుళం రోడ్(07615)కు సాయంత్రం 5.45కు ప్రత్యేక రైళ్లు బయలుదేరి విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, విజయనగరం మీదుగా మరుసటి రోజు ఉదయం గమ్యానికి చేరుకుంటాయి. అవే రైళ్లు ఈ నెల 12,16తేదీల్లో శ్రీకాకుళంరోడ్ నుంచి మధ్యాహ్నం 2.45కు తిరిగి వెళతాయి. మరో రైలు చర్లపల్లి నుంచి జనవరి 8న రాత్రి 7.20కు బయలుదేరి మరుసటి ఉదయం గమ్యం చేరుతుంది. అదే రోజు(9న) మధ్యాహ్నం 2.45కు తిరిగి వెళుతుంది.

## ఇస్రో కొత్త చైర్మన్ వీ నారాయణన్



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) నూతన చైర్మన్‌గా వీ నారాయణన్ నియమితులయ్యారు. ప్రస్తుత చైర్మన్ ఎస్ సోమనాథ్ పదవీ కాలం సోమవారంతో ముగియనుంది. అనంతరం జనవరి 14న నారాయణన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. రెండేళ్ల పాటు చైర్మన్‌గా కొనసాగనున్నారు. నారాయణన్ ప్రస్తుతం ఇస్రోలో లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్ సెంటర్ డైరెక్టర్‌గా ఉన్నారు.

# బ్యాంకులదే పూర్తి బాధ్యత

అనుమతి లేని/మోసపూరిత ఆన్‌లైన్ లావాదేవీల కారణంగా తమ ప్రమేయం లేకుండానే ఖాతాలోని డబ్బు పోగొట్టుకున్న బాధితులు మూడ్రోజుల్లో ఫిర్యాదు చేస్తే.. బ్యాంకులు పరిహారం ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పింది. అయితే.. భారతీయ రిజర్వ్ బ్యాంకు(ఆర్‌బీఐ) 2017 జులై 6న ఇచ్చిన సర్క్యులర్‌లో పేర్కొన్నట్లుగా బాధితులు మూడ్రోజుల్లో ఫిర్యాదు చేస్తే.. థర్డ్‌పార్టీ యాప్, వ్యక్తుల ద్వారా జరిగే మోసాల విషయంలోనూ బాధితులకు ఊరట కలిగించాల్సిన బాధ్యత బ్యాంకులదేనని స్పష్టం చేసింది. గువాహటికి చెందిన పల్లభ్ భౌమిక్ అనే బాధితుడి విషయంలో జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్‌ల ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. బాధితుడు 2021లో ప్రపంచ దిగ్గజ గార్మెంట్స్ సంస్థ లూయిఫిలిప్ నుంచి రూ.4 వేలు వెచ్చించి, ఓ బ్లేజర్ కొనుగోలు చేశారు. ఆ తర్వాత.. దాన్ని వాపస్ చేస్తానంటూ లూయిఫిలిప్ వెబ్‌సైట్‌లో కస్టమర్ కేర్‌కు సమాచారం ఇచ్చారు. తనకు రూ.4 వేలను వెనక్కి ఇవ్వాలని కోరారు. అయితే.. 2021లో లూయిఫిలిప్ వెబ్‌సైట్ హ్యాకింగ్‌కు గురై.. ఆ సైట్ నియంత్ర హ్యాకర్ల చేతికి వెళ్లిపోయింది. వెబ్‌సైట్‌లో కస్టమర్‌కేర్‌ను సంప్రదించినట్లు బాధితుడు భావించినా.. దీన్ని సైబర్ నేరగాళ్లు అవకాశంగా మలచుకుని, లూయిఫిలిప్ మేనేజర్ పేరుతో ఫోన్ చేశారు. “తప్పకుండా మీ సొమ్మును తిరిగి ఇస్తాం. అయితే.. మీరు మేము పంపే లింకు ద్వారా యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి” అని సూచించారు. బాధితుడు ఆ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయగానే.. అతని ఎస్‌బీఐ ఖాతాలో ఉన్న రూ.94,204.80 గూగుల్‌పే ద్వారా సైబర్ నేరగాళ్ల ఖాతాకు బదిలీ అయ్యింది. తన ఖాతా ఖాళీ అవ్వడంతో బాధితుడు ఎస్‌బీఐ కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసి, జరిగిన మోసంపై ఫిర్యాదు చేశారు. అయితే గూగుల్‌పే ద్వారా లావాదేవీలు జరిగినందున తాము బాధ్యులం కాదని కస్టమర్‌కేర్ సిబ్బంది సమాధానమిచ్చారు. దాంతో బాధితుడు గువాహటి పోలీసులు, అసోం సీఐడీ సైబర్ క్రైమ్ సెల్, జాతీయ సైబర్ నేరాల నమోదు పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్‌ను సంప్రదించినా.. న్యాయం జరగకపోవడంతో గువాహటి హైకోర్టును ఆశ్రయించారు. ఈలోగా నిందితుడు ఉత్తరప్రదేశ్‌కు చెందినవాడని సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. నేరం జరిగిన 24 గంటల్లోనే బాధితుడు ఫిర్యాదు చేశారని, ఎస్‌బీఐదే లోపమని హైకోర్టు సింగిల్ బెంచ్ స్పష్టం చేసింది. అతను కోల్పోయిన రూ.94,204.80ని తిరిగి ఇచ్చేయాలని తీర్పునిచ్చింది. ఆ తీర్పుపై ఎస్‌బీఐ డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. బాధితుడు గూగుల్‌పే ద్వారా డబ్బును బదిలీ చేశాడని, అతనికి ఓటీపీ కూడా వచ్చిందని బ్యాంకు తరఫు న్యాయవాదులు వాదనలను వినిపించారు. అయితే.. బాధితుడి పక్షానే న్యాయం ఉండడంతో.. ఎస్‌బీఐ సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. తాజాగా ఈ కేసును విచారించిన జస్టిస్ జేబీ పార్దివాలా నేతృత్వంలోని ధర్మాసనం ఎస్‌బీఐనే తప్పుబట్టింది. “ఎస్‌బీఐ వద్ద అధునాతన సాంకేతికత ఉంటుంది. అనుమతి లేని/మోసపూరిత ఆన్‌లైన్ లావాదేవీలను గుర్తించి, నియంత్రించే అవకాశాలుంటాయి. బాధితుడి ప్రమేయం లేకుండానే ఆయన ఖాతాలోని సొమ్ము బదిలీ అయ్యింది. కాబట్టి.. ఎస్‌బీఐ అతనికి పరిహారంగా మొత్తం సొమ్మును తిరిగి ఇవ్వాల్సిందే” అని తీర్పునిచ్చింది. అదే సమయంలో బ్యాంకు ఖాతాదారులు కూడా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఓటీపీని ఇతరులకు చెప్పినా.. నిర్లక్ష్యంగా వ్యవహరించినా.. ఖాతాదారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది.

# అండగా ఉంటా!

గతనెల 4న పుష్ప-2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ చనిపోగా, ఆమె కుమారుడు శ్రీతేజ తీవ్రంగా గాయపడ్డాడు. బాలుడిని హుటాహుటిన సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించగా అప్పటి నుంచి అక్కడే చికిత్స పొందుతున్నాడు. అయితే పరామర్శ కోసం కిమ్స్ ఆస్పత్రికి వెళ్లేముందు తమకు సమాచారం ఇవ్వాలని రాంగోపాల్‌పేట్ పోలీసులు అల్లు అర్జున్‌కు గతంలోనే నోటీసులిచ్చారు. మంగళవారం ఉదయం అల్లుఅర్జున్ ఆస్పత్రికి వస్తున్నారని సమాచారం రావడంతో ఆస్పత్రి వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆస్పత్రి సిబ్బందిని కూడా ఆ పరిసరాల్లో లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అల్లు అర్జున్ ఆస్పత్రికి రాకమునుపే తెలంగాణ ఎఫ్‌డీసీ చైర్మన్, నిర్మాత దిల్‌రాజ్ అక్కడికి చేరుకున్నారు.

అల్లు అర్జున్ ఆస్పత్రికి వచ్చాక దిల్‌రాజ్‌తో కలిసి శ్రీతేజ వద్దకు వెళ్లారు. శ్రీతేజ ఆరోగ్య పరిస్థితిని కిమ్స్ ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ సంబిత్ సాహూను అడిగి తెలుసుకున్నారు. బాలుడికి మెరుగైన చికిత్స అందించాలని ఆయన వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న శ్రీతేజ తండ్రి బాస్కర్ వద్దకు వెళ్లి పరామర్శించారు. ‘మీకు అండగా ఉంటాను. ఎలాంటి ఆందోళనా వద్దు. నేను అన్ని చూసుకుంటా’ అని భరోసా ఇచ్చారు. దాదాపు 20 నిమిషాల పాటు అల్లు అర్జున్ ఆస్పత్రిలోనే ఉన్నారు. కాగా శ్రీతేజ ఆరోగ్యం నిలకడగా ఉందని కిమ్స్ వైద్యులు వివరించారు. వెంటిలేటర్, ఆక్సిజన్ అవసరం లేకుండా శ్రీతేజకు వైద్యం అందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఎలాంటి యాంటిబయాటిక్స్ అందించడం లేదని, బాలుడు క్రమంగా కోలుకుంటున్నాడని చెప్పారు. అప్పడప్పుడు జ్వరం వచ్చి.. తగ్గుతోందని వెల్లడించారు. కొన్నిసార్లు కళ్లు తెరిచి చూస్తున్నాడని, అయితే ఎవరినీ గుర్తించడం లేదని, ఎవరైనా పిలిచినా పలకడం లేదన్నారు.

# వికేంద్రీకరణతో సమ అభివృద్ధి

భారత్‌కు విదేశీ పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయిబీ భారతీయ యువజనులేమో మెరుగైన విద్యకు విదేశాలకు వెళ్లుతున్నారు! ఆ విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత అక్కడే ఉపాధి అవకాశాలు అన్వేషించుకుని స్థిరపడుతున్నారు. ఈ రెండు వాస్తవాలు వర్తమాన భారతీయ సమాజ విచిత్ర వైరుధ్యాలు కావా?

ప్రభవిస్తున్న నవ భారతంలో వాణిజ్య, పారిశ్రామిక, సేవా రంగాలలో భారీ పెట్టుబడులతో విదేశీ సంస్థలు ప్రవేశిస్తుండగా, సరైన ఉపాధి, విద్యావకాశాలు లేక భారతీయ యువత విదేశాలకు వెళ్లుతోంది. నెలకు సగటున 450 కోట్ల డాలర్ల విదేశీ పెట్టుబడులు వస్తున్నాయి. ఇది, నిస్సందేహంగా భారత్ శీఘ్ర పురోగతికి ఒక సూచిక. అయితే నెలకు సగటున రెండు లక్షల మంది ఉపాధి ఆవకాశాలను వెతుక్కుంటూ విదేశాలకు వెళ్లవలసి రావడం తిరోగమనానికి సంకేతమనేది అవిస్మరణీయం.

విదేశీ పెట్టుబడులను అత్యధికంగా సాధించే రాష్ట్రం గుజరాత్. అయితే అక్రమ మార్గాల్లో అమెరికాకు వెళ్లుతున్న వారిలో అత్యధికంగా ఉంటున్నవారు గుజరాతీ యువజనులే అన్నది ఒక కఠోర వాస్తవం. అత్యధిక విదేశీ పెట్టుబడులను పొందే దేశం చైనా. చైనా పౌరులు ఎవరూ ఉపాధి వలసలకు స్వదేశ సరిహద్దులు దాటి వెళ్లరు మరి.

మౌలిక సదుపాయాల వసతులతో పాటు పరిశ్రమలో పని చేయడానికి అవసరమైన మానవ వనరులు కూడ చాలా అవసరమనే విషయాన్ని భారతీయ పాలకులు విస్మరిస్తున్నారు. తమ యువతకు సాఫ్ట్‌వేర్ శిక్షణ ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలు అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ సంస్థలు తమ వద్దకు వచ్చే విధంగా చేసుకోవడంలో సఫలమయ్యాయి. ఈ సాఫల్యతను ఇతర రంగాలలోనూ మరింతగా సాధించవలసిన అవశ్యకత ఉంది.

విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో దక్షిణాదిలో ప్రథమ స్థానం తమిళనాడుదే అని మరి చెప్పనవసరం లేదు. ఐటితో పాటు ఇతర రంగాలను ఆ రాష్ట్రం వ్యూహాత్మకంగా అభివృద్ధి చేస్తోంది. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ ఉత్పాదక రంగంలో విదేశీ పెట్టుబడులు సింహభాగం ఆ రాష్ట్రానికే వెళతాయి. ఈ రంగాలకు అవసరమైన నైపుణ్యతతో కూడిన మానవ వనరులను అభివృద్ధిపరచి విదేశీ సంస్థలకు అందుబాటులో ఉంచుతుంది. ఈ కారణాన శాంసంగ్‌తో సహా అనేక విదేశీ సంస్థలు తమిళనాడును ఎంచుకుంటున్నాయి. దేశంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్ వాహనాలలో దాదాపు సగం వరకు ఒక్క తమిళనాడు నుంచే వస్తున్నాయి. విద్యుత్ వాహనాల ఉత్పత్తిలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వియత్నాం కంపెనీ విన్ ఫాస్ట్ రూ. 16 వేల కోట్ల రూపాయల పెట్టుబడికి తమిళనాడునే ఎంచుకున్నది. ఈ ఒక్క పరిశ్రమతో 20 వేల మందికి ఉపాధి అవకాశాలు ఏర్పడ్డాయి. పైగా తమిళనాడులోని విభిన్న ప్రాంతాలలో క్లస్టర్ల ఏర్పాటుతో సమ అభివృద్ధికి ఆస్కారమేర్పడుతుంది.

ఐటి నైపుణ్యత అభివృద్ధి ద్వారా అటు పెట్టుబడులు ఇటు ఉపాధి అవకాశాలను పెంపొందించిన అనుభవంతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు చమురు రంగంలో పెట్టుబడులతో పాటు పెట్రో కెమికల్స్ విశ్వవిద్యాలయంపై దృష్టి పెట్టారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే అంతగా అనుకూల పరిస్థితులు లేకున్నా ఉత్తరప్రదేశ్‌కు సైతం విదేశీ పెట్టుబడులు భారీగా రావడం గమనార్హం. తెలంగాణ సైతం విదేశీ పెట్టుబడుల విషయంలో ప్రశంసనీయమైన రీతిలో ముందుకు వెళ్లుతోంది. ఖాళీ ఖజానాతో తాము అధికార బాధ్యతలు స్వీకరించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరుచు ప్రస్తావిస్తుంటారు. ఇది, స్థానిక రాజకీయ కోణంలో అనుకూలిస్తున్నా పెట్టుబడుల దృక్పథంతో పరిశీలిస్తే ప్రతికూలంగా మారే పరిస్థితులు ఉన్నాయి. అయినప్పటికీ తెలంగాణకు విదేశీ పెట్టుబడులు వస్తుండడం హర్షణీయం. గత ప్రభుత్వం తరహా కార్పొరేటీకరణ, ప్రచార అర్భాటం లేకుండా రేవంత్ సర్కార్ ఈ దిశగా వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో తెలంగాణలో అదానీ పెట్టుబడులను ఒక వ్యాపారాత్మక దృష్టితో చూడాలి కానీ రాజకీయ కోణంతో కాదు. కేరళలో వామపక్ష ప్రభుత్వం కూడా అదానీ పెట్టుబడులను స్వాగతించిందనే విషయాన్ని విస్మరించకూడదు.

అధికార బాధ్యతలు స్వీకరించిన కొద్ది వారాలకే రేవంత్‌రెడ్డి ప్రపంచ పెట్టుబడుల సదస్సులో పాల్గొనడానికి స్విట్జర్లాండ్ వెళ్లారు. గత ప్రభుత్వ హయాంతో పోల్చితే ఈ సారి 33 శాతం అదనంగా పెట్టుబడులను తెలంగాణ సాధించినట్లుగా కేంద్రం విడుదల చేసిన గణంకాలు వెల్లడించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తెలంగాణకు వచ్చిన రూ. 12,864 కోట్లు హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాలకు రావడం జరిగింది. పెట్టుబడులకు తోడుగా రేవంత్‌రెడ్డి సర్కార్ స్కిల్ యూనివర్శిటీని కూడా శరవేగంగా అభివృద్ధి చేస్తోంది. పెట్టుబడులతో రాష్ట్రానికి వచ్చే పారిశ్రామికవేత్తల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యత కల్గిన యువతను అందించే ఈ విశ్వవిద్యాలయం మదుపుదారులకు అదనపు ఆకర్షణగా ఉంటుందనడంలో సందేహం లేదు, పెట్టుబడులతో పాటు ఈ విశ్వవిద్యాలయ ప్రాంగణాలను హైద్రాబాద్‌ను దాటి ఇతర ప్రాంతాలలోను విస్తరింప చేసే దిశగా అలోచించాలి.

పెట్టుబడులను ఆకర్షించడంలో దేశీయంగా తమిళనాడు, అంతర్జాతీయంగా చైనా, సౌదీ అరేబియాలు అనుసరించే విధానాలను ఆదర్శంగా తీసుకోవలిసిన అవసరమున్నది. విదేశీ పెట్టుబడుల ద్వారా తెలంగాణలో ఉత్పన్నమయ్యే అభివృద్ధి, ఉపాధి అవకాశాలను సమరీతిలో వికేంద్రీకరిస్తే ఒక నూతన ఒరవడికి శ్రీకారం చుట్టినట్లవుతుంది.

# మోడీ గుప్పెట్లో భారతీయ మీడియా

హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్:

- ఎమర్జెన్సీ కన్నా అధ్వాన పరిస్థితులు
- దారితప్పిన మెయిన్ స్ట్రీమ్
- ఇండిపెండెంట్ జర్నలిజానికి పెరుగుతున్న ఆదరణ :
- "ద వైర్" తెలుగు వెబ్‌సైట్ ఆవిష్కరణ సభలో వక్తలు




"మోడీ గుప్పెట్లో భారతీయ మీడియా బందీ అయ్యింది. గత పదేండ్లుగా ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ప్రమాదంలో పడ్డాయి.ఎమర్జెన్సీ కన్నా అధ్వాన పరిస్థితులు దేశంలో నెలకొన్నాయి. ప్రధాన మీడియా దారితప్పింది, అది ప్రభుత్వాలకు అంట కాగుతూ అవాస్తవాలను,అసాంఘిక కార్యకలాపాలను పోటీ పడి వ్యాప్తి చేస్తోంది. వాట్సాప్, ఫేస్‌బుక్ యూనివర్శిటీలు ఈ ధోరణికి వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితుల్లో వాస్తవాలను వెలికితీస్తున్న 'ద వైర్' వెబ్‌సైట్ పదేండ్లుగా దేశంలో ప్రతిపక్ష పాత్ర పోషిస్తోంది" అని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. "ద వైర్ తెలుగు ప్రారంభ సభ" కార్యక్రమం సోమవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో కొండూరి వీరయ్య అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన సీనియర్ పాత్రికేయులు, పీఎంవో మాజీ సలహాదారు సంజరుబారు మాట్లాడుతూ భారతీయ మీడియా ప్రభుత్వాలకు మద్దతుగా నిలుస్తూ తమ వ్యాపారాన్ని విస్తరించేందుకు అడ్డదారులు తొక్కుతోందని ఆరోపించారు. 2024 ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఒపినీయన్ పోల్ నుంచి మొదలుకుని ఎగ్జిట్‌పోల్ వరకు ప్రధాన మీడియా సర్కార్‌కు వెన్నుదన్నుగా నిలిస్తే, ఇండిపెండెంట్ మీడియా మాత్రం క్షేత్రస్థాయి వాస్తవాలను వెల్లడించిందని గుర్తు చేశారు. యాజమాన్యాలు జర్నలిస్టులను వార్తలు సేకరించే యంత్రాలుగానే చూస్తున్నాయని వాపోయారు. వారి వృత్తి స్వేచ్ఛ, జీవించే స్వేచ్ఛను హరించాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో మీడియా సంక్షోభంలోకి నెట్టివేయబడిన తరుణంలో 2015లో వచ్చిన 'ది వైర్' ప్రజల పక్షాన నిలిచిందని కొనియాడారు. ప్రముఖ రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో మౌలిక విలువలపై ఒక ప్రణాళికాబద్ధంగా దాడి జరుగుతోందని అన్నారు. ఈ దాడి నుంచి దేశాన్ని కాపాడేందుకు పత్రికలతో పాటు పౌర సమాజం తమదైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. దురదృష్ట వశాత్తూ మీడియా ఆ పాత్రనుంచి తప్పుకున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. సినిమా హాల్లో తొక్కిసలాట ఎలా జరిగిందనే దానిపై పెట్టిన దృష్టి పెరుగుతున్న నిరుద్యోగం, ధరల పెరుగుదల, మేధావులు, నిపుణులు దేశాన్ని వదిలి వెళ్లడం లాంటి అంశాలపై మీడియా తన వంతు పాత్రను ఎందుకు పోషించడం లేదని ప్రశ్నించారు. ది వైర్ వ్యవస్థాపకులు సిద్ధార్థ వరదరాజన్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా, ఎవరి ప్రలోభాలకు లొంగ కుండా ప్రజల మద్దతుతో పదేండ్లుగా వైర్‌ను నిఖార్సైన మీడియా సంస్థగా తీర్చిదిద్దామని పేర్కొన్నారు. ప్రశ్నిస్తేనే భరించలేని ప్రధాని ఈ దేశాన్ని ఏలుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన పదేండ్ల కాలంలో ఎన్నడూ ప్రెస్‌మీట్ పెట్టి మీడియా ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చింది లేదని ఎద్దేవా చేశారు. ఎప్పుడూ తాము చెప్పిందే రాసుకోవాలనే ధోరణి ప్రజాస్వామ్యానికి శ్రేయస్కరం కాదని అన్నారు. వైర్ మాత్రం మోడీ నుంచి మొదలుకుని అందరి తప్పులను ఎత్తి చూపుతూ నిత్యం ప్రశ్నిస్తూనే ఉంటుందని తేల్చి చెప్పారు. అంబేద్కర్ యూనివర్శిటీ ఉపకులపతి ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలు రాజకీయ సంచనాలకు మారుపేరని అన్నారు.ఇక్కడ వార్తా కథనాలకు కొదవలేదనీ,అయితే వాటికి సరైన వేదిక లేదని అన్నారు. ఆ లోటును వైర్ తెలుగు ఎడిషన్ తీర్చాలని ఆకాంక్షించారు. తెలంగాణ గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు రియాజ్ మాట్లాడుతూ పోరాటాలకు, ఉద్యమాలకు నెలవైన తెలుగు నేలపై వైర్ చేస్తున్న ప్రయత్నానికి తమ వంతు సహకారాన్ని అందిస్తానని ప్రకటించారు. వైర్ సంపాదకులు సీమా చిస్తి, ఎం.కె.వేణు మాట్లాడుతూ భారతీయ మీడియా సినిమా, క్రికెట్, నేరాలు అనే మూడు అంశాలకు ఇస్తున్న ప్రాధాన్యతలను ప్రజా సమస్యలకు ఇవ్వడం లేదని ఆక్షేపించారు. 2024లో మోడీకి పూర్తి మెజార్టీ వస్తే దేశంలో మీడియాను ఉక్కుపాదంతో అణిచివేసే వారని గుర్తు చేశారు.వాస్తవాలను రాస్తున్న వైర్‌పై అదానీ, అంబానీ లాంటి వారు వేల కోట్ల రూపాయల పరువు నష్టం దావాలు వేస్తున్నారని పేర్కొన్నారు. తెలుగు ఎడిషన్ విభాగం సైతం అన్నింటిని తట్టుకుని ముందుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పాత్రి కేయులు కె. రామచంద్రమూర్తి, జాతీయ సమాచార హక్కు మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్, తెలకపల్లి రవి,దేవులపల్లి అమర్ , ఎన్.వేణుగోపాల్, సి .వనజ,విమల, కార్టూనిస్ట్ శ్రీధర్, పీపుల్స్ పల్స్ రవిచంద్ర వైర్ తెలుగు ఎడిటోరియల్ సభ్యులు కొండూరి వీరయ్య, నెల్లూరి నర్సింహరావు, ఐ వి. రమణారావు ,కాపు శ్రీనివాస్,కోయ చంద్ర మోహన్ మరియు పలువురు పౌర సమాజ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఓం నారాయణ అక్రమించుకున్న ప్రభుత్వ భూమినీ తక్షణమే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని మహబూబాద్ ఆర్డీఓ కు వినతి పత్రం అందజేసిన, ఎల్ హెచ్ పి ఎస్,నాయకులు



మహబూబాద్ టౌన్ తెలంగాణ సేన జనవరి 7

మంగళవారం రోజున మానుకోట పట్టణంలోని 107 సర్వే నెంబర్లో 1-34 గుంటల ప్రభుత్వ భూమిని దర్జాగా అక్రమించుకొని షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించుకొని నెలకు కోటి రూపాయలు కిరాయి తీసుకుంటూ,ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్న అతనిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకొని క్రిమినల్ కేసు నమోదు చేయాలని లంబాడి హక్కుల పోరాట సంఘం ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు భీమా నాయక్ %=ఋూ% గారికి విన్నవించారు అనంతరం %=ఋూ% గారికి ఎల్ హెచ్ పీఎస్ జిల్లా బృందం పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా భీమా నాయక్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ప్రభుత్వ భూములను ప్రభుత్వానికి అప్పజెప్పాలని, కబ్జాదారులను జైలుకు పంపాలని అన్నారు ప్రభుత్వం తక్షణమే స్పందించి అతనిపై చర్యలు తీసుకొని భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.లేని యాడల దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని మాట్లాడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్ పీఎస్ జిల్లా ప్రధాన సలహాదారుడు విష్ణు నాయక్, ఎల్ఎస్ఓ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ నాయక్, డోర్నకల్ నియోజకవర్గ ఇన్చార్జ్ మంగీలాల్ నాయక్, వికలాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు రాందాస్ నాయక్, కార్యదర్శి బాలు నాయక్, కురవి మండల అధ్యక్షులు శ్రీను నాయక్,బయ్యారం మండల అధ్యక్షులు చంద్రశేఖర్ నాయక్,గార్ల మండల ఇన్చార్జి రమేష్ నాయక్ లు పాల్గొన్నారు.

# బీజేపీ మాజీ ఎంపీ రమేష్ బిధురీ వ్యాఖ్యలు సిగ్గుచేటు

- నియోజకవర్గ యూత్ ప్రధాన ప్రధాన కార్యదర్శి వేముల గోపీనాథ్ శాలిగౌరారం:



వయానాడ్ ఎంపీ ప్రియాంక గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిజెపి మాజీ ఎంపీ రమేష్ భిధురిని వెంటనే బిజెపి నుంచి సస్పెండ్ చేయాలని తుంగతుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేముల గోపీనాథ్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మంగళవారం గోపీనాథ్ మాట్లాడుతూ ఎంపీ ప్రీయాంక గాంధీపై బీజేపీ మాజీ ఎంపీ రమేష్ భిధురి చేసిన అనుచిత వ్యాఖ్యలు చాలా సిగ్గుచేటుగా ఉన్నాయన్నారు. బిజెపి నాయకులకు మహిళల పట్ల ఎలాంటి గౌరవం ఉందో ఆయన వ్యాఖ్యలతోనే అర్థం చేసుకోవచ్చన్నారు. నాడు ఇందిరాగాంధి ,రాజీవ్ గాంధీ ,హయంలో గాని నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హయాంలో గాని నాటి నుండి నేటి వరకు కాంగ్రెస్ పార్టీ మహిళలకు బ్రహ్మరథం పడుతూ రాజకీయంగా,ఆర్థికంగా మహిళలకు సముచిత స్థానం కల్పిస్తుంటే, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం మహిళలను కించపరుస్తూ మహిళలను స్వేచ్ఛగా నిర్భయంగా తిరిగే పరిస్థితి లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. బిజెపి అధిష్టానానికి మహిళల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న రమేష్ భీధురిని వెంటనే సస్పెండ్ చేసి,యావత్ మహిళలోకానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

# తెలంగాణ ఉద్యమకారుల కల నెరవేరేనా

-ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసేదెప్పుడు



తెలంగాణ రాష్ట్ర సాధన కోసం త్యాగాలు చేసిన ఉద్యమకారుల కలనెరవేరేన అని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి సంఘీశెట్టి క్రిస్టోఫర్ అన్నారు. ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడం ఎందుకు ఆలస్యం జరుగుతుందోనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీ 25 వేల రూపాయల పెన్షన్, 250 గజాల ఇంటి స్థలం ఇచ్చి హామీ నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఉద్యమకారులకు ఇచ్చిన హామీ పై స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన అన్నారు. త్యాగాలు ఉద్యమకారులు లేనిదే తెలంగాణ రాష్ట్రం రాలేదని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించు కోవాలని అలాంటి త్యాగాలు చేసిన వారిని నిర్లక్ష్యం చేయడం తగదని ఆయన అన్నారు.

# అసంపూర్తిగా ఉన్న రెండు పడకల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కాంట్రాక్టర్ లు ఆదేశాలు

వివిధ స్థాయిల్లో అసంపూర్తిగా ఉన్న రెండు పడకల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కాంట్రాక్టర్ ను ఆదేశించారు. కొత్తకోట మండలం పామాపురం గ్రామం, పెబ్బేరు మండలం పాతపల్లె గ్రామాల్లో గత ప్రభుత్వ హయంలో మంజూరు అయి అసంపూర్తిగా మిగిలిపోయిన రెండు పడకల ఇళ్ల నిర్మాణ పనులను జిల్లా కలక్టర్ మంగళవారం ఉదయం పరిశీలించారు. పామపురం గ్రామంలో నాలుగు సంవత్సరాల క్రితం 56 రెండు పడకల ఇళ్ళు మంజూరు కాగా అవి పూర్తి అయి లబ్ధిదారులకు కేటాయింపులు పూర్తి అయ్యాయి. ఇంకొందరికి అవసరమని గ్రామస్తులు పట్టుబట్టి ఎన్నికల ముందు మరో 25 ఇళ్ళు మంజూరు చేయించుకున్నారు. వాటిలో ప్రస్తుతం కొన్ని రూఫ్ లెవల్, బెస్మెట్ లెవల్, కొన్ని ఫైనల్ స్టేజికి వచ్చాయని పంచాయతీ రాజ్ కార్యనిర్వహక ఇంజనీరు మల్లయ్య కలక్టర్ ను వివరించారు. అదేవిధంగా పెబ్బేరు మండలం పాతపల్లి గ్రామంలో 50 రెండు పడకల ఇళ్ళు మంజూరు కాగా అవి అన్ని రూఫ్ లెవల్ పూర్తి అయ్యాయి. గోడలు లేపడం, ప్లాస్టరింగ్ తదితర పనులు పెండింగ్ లో ఉన్నాయి. రెండు గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పరిశీలించిన జిల్లా కలక్టర్ పని అయినంతవరకు యం.బి. తయారు చేసి ఇవ్వాలని కార్యనిర్వహక ఇంజనీరు ను ఆదేశించారు. బిల్లులు చెల్లించడం జరుగుతుందని, ఇళ్ళు నాణ్యతగా నిర్మించి ఉగాది లోపు పూర్తి చేసి ఇవ్వాలని కాంట్రాక్టరు ను ఆదేశించారు. కార్యనిర్వహక ఇంజనీరు మల్లయ్య, పెబ్బేరు తహసిల్దార్ లక్ష్మి, ఎంపిఓ రోజా, కాంట్రాక్టరు షణ్ముఖి, తదితరులు కలక్టర్ వెంట ఉన్నారు.

## తిరుమలగిరి లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పర్యటన



తిరుమలగిరి మున్సిపాల్టీ పరిధిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే పదవ తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఇప్పటి నుండే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, ఉపాధ్యాయులకి సూచించారు. పదవ తరగతి విద్యార్థులకి ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా స్టడీ అవర్స్ ఏర్పాటు చేయాలని, అలాగే వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని,చదువు లో వెనుకబడిన విద్యార్థులు కుంగి పోకుండా బాగా చదివి ఉత్తీర్ణులు అయ్యే విధంగా ప్రయత్నించాలని ప్రయత్నిస్తే ఏదైనా సాధ్యం అవుతదని సూచించారు. కార్యక్రమం లో యం ఈ ఓ శాంతయ్య, ప్రధానోపాధ్యాయులు డా దామెర శ్రీనివాస్, ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్, నర్సయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ జిల్లా చరిత్ర ప్రదర్శన అద్భుతం

- డాక్టర్ తుమ్మల దేవరావు మానస సాహితీ సంస్థ వ్యవస్థాపకులు



నిర్మల్ ఉత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ మినీ స్టేడియంలో మానససాయితీ సంస్థ, డాక్టర్ కావేరి ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ప్రాచీన వస్తు ప్రదర్శన అద్భుతమని మంత్రివర్యులు, జిల్లా ఇంచార్జ్ మంత్రి సీతక్క అన్నారు. ఈ ప్రదర్శనను చూసి నిర్మల్ జిల్లా యొక్క వైభవం, చరిత్ర అవగతమైతుందని అన్నారు. మంత్రి వెంట ఎమ్మెల్సీ , గ్రంథాలయ చైర్మన్ ఉన్నారు ప్రదర్శనను ఆసక్తితో అన్ని వివరాలు అడిగి తెలుసుకుని చూశారు. సేకరించిన వస్తువుల యొక్క వైశిష్టతను ప్రముఖ చారిత్రక పరిశోధకుడు డాక్టర్ తుమ్మల దేవరావ్ వివరించారు ఈ కార్యక్రమానికి శ్రీకారం చెప్పిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ , జిల్లా ఎస్పీ జానకి షర్మిల , అడిషనల్ కలెక్టర్ ఫైజ్ అహ్మద్ , జాయింట్ కలెక్టర్ , జిల్లా విద్యాధికారి , డి ఆర్ డి ఓ పి డి , జిల్లా వైద్యాధికారి మరియు అనేక మంది జిల్లా అధికారులు తిలకించారు. రెండవ రోజు ప్రదర్శనకు 5000 మంది వరకు విజిట్ చేశారు. ఇది మన నిర్మల్, ఇది మన చరిత్ర, ఇది మన వారసత్వం అంటూ కితాబు నిచ్చారు మంత్రి వర్యులు తన ప్రసంగంలో ప్రధానంగా ఈ విషయాన్ని మాట్లాడినారు. ఈరోజు ఆఖరి రోజు మన పురావైభవం కుటుంబం తో సహా వచ్చి చూడండి డాక్టర్ తుమ్మల దేవరావ్ అన్నారు

## డాక్టరేట్ మరింత బాధ్యత పెంచింది

- టిఎస్ఏవైఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్. అవిలయ్య

% సమాజ సేవలో ఉన్న తనకు గౌరవ డాక్టరేట్ ప్రధానం చేయడం మరింత బాధ్యత పెంచిందని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం (టిఎస్ఏవైఎస్) రాష్ట్ర అధ్యక్షుడు చిప్పలపల్లి అవిలయ్య అన్నారు. సోమవారం రాత్రి హైదరాబాద్ లోని అబిడ్స్ గన్ ఫౌండ్రీ వద్ద ఉన్న సూర్య లోక్ సింప్లెక్స్ లో దేస్ప్రింగ్ తియోలాజికల్ యూనివ ర్సిటీ చైర్మన్ అండ్ డైరెక్టర్ డాక్టర్ ఎంవి.ప్రసాద్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ ను అందుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం (టిఎస్ఏవైఎస్) రాష్ట్ర అధ్యక్షుడు చిప్పలపల్లి అవిలయ్య మాట్లాడుతూ గాడ్ సన్ హెూలీ స్పిరిట్ మినిస్ట్రీస్, గాడ్ సన్ హెూలీ స్పిరిట్ థియోలాజికల్ అకాడమీ అనుబంధమైన దేస్ప్రింగ్ థియోలాజికల్ యూనివర్సిటీ టెక్సాస్ యూఎస్ఏ, గుడ్ న్యూస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ న్యూయార్క్ యూఎస్ఏ గ్రాడ్యుయేషన్ ఆధ్వర్యంలో 2025 సంవత్సరానికి గాను సామాజిక సేవలో సమాజ సేవలు అందిస్తున్న తనకు హైదరాబాద్ లోని అబిడ్స్ గన్ఫౌండ్రీ వద్ద ఉన్న సూర్య లోక్ కాంప్లెక్స్ లో గౌరవ డాక్టరేట్




ప్రధానం చేశారని తెలిపారు. ఈ డాక్టరేట్ సమాజ సేవలో మరింత బాధ్యతను పెంచింద న్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ కన్స్యూమర్ రైట్స్ అడ్వైసరీ బోర్డు చైర్మన్ డాక్టర్ పి. అబ్దుల్ రహిమాన్, సిని నటుడు డాక్టర్ బాల్ రెడ్డి పృధ్వి రాజ్, తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్రె సత్య నారాయణ, పుష్పలత, మణి కిరణ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మి చెక్కులు



వేములవాడ అర్బన్ మండలం అనుపుర%శీ% గ్రామంలో 33 లక్షల విలువ గల 33 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి %ఓ% షాది ముబారాక్ చెక్కులను, 8లక్షల 02 వేల విలువ గల 21 ముఖ్యమంత్రి సహాయనిది చెక్కులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు..

## సమ్మె విరమణ పత్రాన్ని నిర్మల్ డీఈఓకు అందజేసిన సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నాయకులు.



నిర్మల్ జిల్లాలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆధ్వర్యంలో గత 29 రోజులుగా కొనసాగుతున్న నిరవధిక సమ్మె నేటితో విరమించి విధుల్లో చేరుతున్నట్లు సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షులు భూసారపు గంగాధర్ తెలిపారు ప్రభుత్వం తమ డిమాండ్లను అంగీకరించి ఆర్థికేతర విషయాలకు నెల రోజులు ఆర్థికపరమైన విషయాల పరిష్కారానికి మూడు నెలల సమయం కోరినందున ప్రభుత్వంపై నమ్మకంతో సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు వారు ప్రకటించారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ వెంటనే ఆపాలి



మందమర్రి మండలం లోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ నీ ఆపాలని మంగళవారం స్థానిక ఎమ్మార్వో సతీష్ కుమార్ కు ఆదివాసీ నాయక పోడు సేవా సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఏజెన్సీ ప్రాంతంలో కనీసం గ్రామ సభలు కూడా నిర్వహించకుండా డబల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఈ కేటాయింపులను వెంటనే ఆపాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి నాయక పోడు సేవా సంఘం నాయకులు రాజకుమార్, పెద్ది భార్గవ్, బైరనేని లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రి భాయి పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు నగదు బహుకరణ



% జనగామ మండలం చౌడారం గ్రామంలో గత సంవత్సరం 10వ తరగతిలో మొదటి, రెండవ స్థానంలో ఉత్తీర్ణులైన లక్ష్మణ్,కుమార్ ల కు చెరుకూరి మౌనిక సంపత్ యాదవ్ దంపతులు నగదు బహూకరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సంపత్ బడుగు బలహీనవర్గాలకు చెందిన విద్యార్థుల కు ఆర్థిక సమస్యలు చదువు కు అడ్డంకి కాకూడదు అని అన్నారు. చదువు మీద దృష్టి పెట్టాలని ప్రభుత్వ పాఠశాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారు వారి జ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని పాఠశాలలో ఉన్న విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరుకోవడం జరిగినది. ఈ కార్యక్రమం లో సావిత్రి భాయి పూలే ఫౌండేషన్ అధ్యక్షుడు యాసారపు కరుణాకర్, ప్రదాన ఉపాధ్యాయులు రమేష్ బాబు,చెరుకూరి సిద్దయ్య,చెరుకూరి యాదయ్య,కారొబార్ ఆగాచారి,ఉపాధ్యాయిని లు,ఉపాద్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## రేపు మహాశివరాత్రి జాతర సమన్వయ సమావేశం

మహా శివరాత్రి జాతర 2025 ను పురస్కరించుకొని వచ్చే నెల 25/02/2025 నుంచి 27/02/2025 వరకు (3 రోజుల)పాటు ఉత్సవాల పై ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమావేశం నిర్వహించ నున్నారు. 08/01/2025 రోజున ఉదయం 10:30 గంటలకు రాజన్న దేవస్థానములోని ఓపెన్ స్లాబ్ హాల్లో మహా శివరాత్రి జాతర సమన్వయ సమావేశము నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వినోద్ రెడ్డి తెలిపారు.

## బైకులపై అక్రమ కలప రవాణా




కవ్వాల్ టైగర్ రిజర్వ్, జన్నారం డివిజనలోని ఇస్లాంపూర్ నుండి అక్రమ కలప బైకులపై రవాణా చేయడం జరిగింది. సోమవారం రాత్రి అటవీ అధికారుల పెట్రోలింగులో భాగంగా ఇస్లాంపూర్ నుండి బైకులపై తరలిస్తున్న టేకు కలపను రేయ్ కుంట వద్ద ఇందన్ పల్లి అటవీ అధికారులు పట్టుకున్నారు. బైకులపై తరలిస్తున్న టేకు కలప విలువ 29వేల 134 రూపాయలు ఉంటాయని అటవీ అధికారులు తెలిపారు. అక్రమంగా అటవీ నుండి కలప రవాణా చేయడం నేరమని, అక్రమంగా కలప రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అటవీ అధికారులు అన్నారు.

## ప్రతి మంగళవారం హనుమాన్ చాలీసా పారాయణం.




దేవరకద్ర మండల కేంద్రంలోని శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయంలో మరియు రైల్వే స్టేషన్ ఏరియాలో గల ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రతి మంగళవారం హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. హనుమాన్ చాలీసా చదవడం వల్ల వల్ల, జ్ఞాపక శక్తి, ధార్మిక శక్తి, పెరిగి సకలజనులు సుఖసంతోషాలతో ఉంటారని తెలిపారు. విద్యార్థులకు జ్ఞాపకశక్తి పెరుగుతుందని, విద్యార్థులు చదువులో మంచిగా రాణించగలరని కనుక ప్రతి ఒక్కరూ హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమం లో పాల్గొనాలని కోరారు. ప్రతి మంగళవారం సాయంత్రం 6:45 గంటలకు ప్రారంభమగును. ఈ కార్యక్రమంలో మహిళలు, పిల్లలు కూడా పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బిసి బహుజన సోదర సోదరీమణులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపిన అలేఖ్య



బిసి సోదర సోదరిమ ణులందరికీ పేరుపేరునా ధన్యావాదాలు బిసి మహిళ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ పేరం అలేఖ్య తెలిపారు . సావిత్రిబాయి పూలే అవార్డు కు ఎంపిక చేసినందుకు ఆదరించి అభిమానించే ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. సావిత్రిబాయి పూలే అవార్డు గ్రహీతగా ఆమెను గుర్తించి ఉన్నత స్థాయికి, సహకరించిన బిసి బహుజన సోదరీ సోదరీమణులందరికీ బిసి మహిళ రాష్ట్ర కన్వీనర్ ను తీసుక వేళ్ళారని పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే అవార్డు బిసి అందరిదని, ఈ అవార్డు బిసి బహుజన సోదర సోదరీమణులందరికీ అంకితం అన్నారు.

## అదనంగా డబ్బులు వసూలు చేస్తున్న సిండికేట్



లింగాల గణపురం మండలం నెల్లుట్ల లో గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించే వారికి %వీఞా% రేట్లకు కాకుండా అదనంగా డబ్బులు వసూలు చేస్తున్న సిండికేట్ శ్రీ సాయి వైన్స్ సిబ్బంది పై ఎక్సైజ్ జిల్లా అధికారికి ఫిర్యాదు చేసిన %దీఞా% జిల్లా అధ్యక్షులు మడిపడిగ చంద్రశేఖర్ మరియు దళిత సంఘాల నాయకులు గండి శ్రీను, జనగాం యాదగిరి, ఇరుగు మహేందర్, తాండ్ర సిద్దులు పాల్గొన్నారు. అలాగే శ్రీనివాస వైన్స్ పార్కింగ్ స్థలం లేక వాహనాలు నిలపడం వల్ల వచ్చి పోయే వాహనదారులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. మరియు ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉంది. అందువల్ల ఎలాంటి రూల్స్ పాటించకుండా వారి ఇష్టారాజ్యంగా వైన్స్ లను కొనసాగిస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కావున నిబంధనలకు విరుద్ధంగా వైన్స్ లను కొనసాగిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని వారి లైసెన్స్ ను రద్దు చేయాలని డిమాండ్ చేయడం జరిగింది.

## రాజన్న భక్తులకు సరైన సేవలు అందడం లేదు

-ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి

-రాజన్న సిరిసిల్ల జిల్లా బిజెపి అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆలయ ఉద్యోగ బదిలీల్లో యాదాద్రి ఆలయం నుండి రాజన్న ఆలయానికి బదిలీపై వచ్చిన ఏ ఈ ఓ లు, సూపర్ డెంట్ తోపాటు మరో ఉద్యోగి డిప్యూటేషన్ పేరుతో మళ్లీ యాదాద్రి ఆలయానికి వెళ్లడంతో ఆలయంలో ఏఈఓ, నాలుగు సూపరిడెంట్ పోస్టులు ఖాళీగా ఉండడంతో మిగిలిన ఉద్యోగులపై పనిబారం పడి భక్తులకు సరియైన సేవలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాజన్న సిరిసిల్ల జిల్లా బిజెపి అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీగా ఉన్న పోస్టులలో ఉద్యోగులను త్వరగా భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రేగుల మల్లికార్జున్, సంటి మహేష్, కోల కిష్ట స్వామి, నామాల శేఖర్, సంగు రాహుల్ తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శించిన చల్మెడ



భీమారం మండల కేంద్రానికి చెందిన ఆకునూరి శంకర్ ఇటీవల ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబాన్ని మంగళవారం బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడి లక్ష్మీనరసింహారావు పరామర్శించారు. శంకర్ కుమారుడు శివ హెూటల్ మేనేజ్మెంట్ డిగ్రీ మూడవ సంవత్సరం చదువుతున్నడు. తండ్రి దూరం అవటంతో చదువుకు ఎలాంటి ఇబ్బంది ఉ ఒడకూడదని తన హెూటల్ మేనేజ్ మెంట్ కావాల్సిన ఫీజు చెల్లిస్తానని, పై చదువులకు కూడా అండగా ఉంటానని చల్మెడ లక్ష్మి నరసింహారావు. హామీ ఇచ్చారు. వారి వెంట అర్జున్, చెక్కపెల్లి రఘు, బస్వరాజుల రాజు, మధుకర్ రావు, అజిత్ రావు, ఎండి రాజబోసు, దామెర పరమేశ్వర్, దాసరి నాగరాజు, దాసరి రఘు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గీత కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

**-వృత్తిని ఉద్యమాన్ని ప్రతిబింబించే విధంగా కల్లుగీత కార్మిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ**



మహుబాబాద్ టౌన్ తెలంగాణ సేన జనవరి 7

రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు యం.వి రమణ,బెల్లంకొండ వెంకటేశ్వర్లు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలన్ని అమలు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు యం.వి.రమణ,బెల్లంకొండ వెంకటేశ్వర్లు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన క్యాలెండర్ ఆవిష్కరణ సభలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృత్తిలో మరణించిన వారి కుటుంబాలకు,వికలాంగులైన వారికి ఇవ్వాల్సిన ఎక్స్‌గ్రేషియా సంవత్సరము నుండి ఇవ్వలేదని వీటిని వెంటనే ఇచ్చి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు.ఎన్నికల ప్రణాళికలో నెలరోజుల లోపు ఇస్తామని,ఐదు లక్షల నుండి పది లక్షలకు పెంచుతామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు.వృత్తి పెన్షన్ 2 వేల నుండి 4 వేలకు పెంచుతామవి,సభ్యులందరికీ ద్విచక్ర వాహనాలు ఇస్తామని, లిక్కర్ షాపుల రిజర్వేషన్స్ 10 నుడి 25% నికి పెంచి సొసైటీలకు ఇస్తామని, ఏజెన్సీ ఏరియాలో సొసైటీలు పునరుద్ధరిస్తామని, జనగామ జిల్లాకు పాపన్న పేరు పెడతామని, ట్యాంక్ బండ్ పై విగ్రహం పెడతామని, వృత్తిలో ఆధునీకరణ తీసుకువచ్చి ఉపాధి మెరుగు పరుస్తామని చెప్పారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుని తమ చిత్తశుద్ధి చాటుకోవాలని అన్నారు. కల్లుగీత వృత్తిని, ఉద్యమాన్ని ప్రతిబింబించే విధంగా క్యాలెండర్ రూపొందించడం జరిగిందన్నారు. ఈ పదేండ్ల కాలంలో సంఘం నిర్వహించిన ముఖ్య కార్యక్రమాలను దీనిలో పొందుపరిచామవి రాష్ట్రవ్యాప్తంగా దీనిని పంపిణీ చేస్తామన్నారు. ప్రకటనలు ఇచ్చి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బొలగాని జయ రాములు, వి.వెంకట నర్సయ్య, పి అచ్చాలు, బాల్నే వెంకట మల్లయ్య, గౌని వెంకన్న, రాష్ట్ర కార్యదర్శులు చౌగాని సీతారాములు,ఎస్ రమేష్ గౌడ్, బూడిద గోపి, బండ కింది అరుణ్, మడ్డి అంజిబాబు మరియు అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## జూరాల ప్రధాన కుడి కాలువ ఆయకట్టు నీరును యాసంగి పంటలు చేతికొచ్చే వరకు సరిపడా నీరును విడుదల చేయాలి

**- తెలంగాణ రైతాంగ సమితి**

గద్వాల, తెలంగాణ సేన న్యూస్:

ప్రియదర్శిని జూరాల ఆయకట్టు కుడి కాల్వ రైతులం ఖరీఫ్ సీజన్లో వేసిన వరి పంటలు తెగుళ్ళు, భారీ వర్షాలు తదితర సమస్యల వల్ల పంటలు దిగబడి తగ్గిపోయి తీవ్ర నష్టానికి గురయ్యాం. ఈ యాసంగిలో పంటలు వేయడానికి భూములను సిద్ధం చేస్తున్నాం కనుక కుడి కాల్వకు ఏ పిల్ల కాలువ వరకు నీళ్లు విడుస్తారు? ఏ నెల వరకు నీరు విడిస్తారు? వరి పంట ఏదైనా 120 రోజుల పంట దినాలు లేదంటే పంటలు ఎండిపోతాయి కనుక ఏప్రిల్ చివరిదాకా పంటలకు సరిపడా నీరు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జూరాల ఆయకట్టు కుడి కాల్వ రైతులు జోగులాంబ గద్వాల జిల్లా. జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షులు జక్కుల వెంకటయ్య ప్రధాన కార్యదర్శి జి గోపాల్ జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు ఖాజా, ప్రధాన కార్యదర్శి సత్య రెడ్డి జిల్లా కమిటీ నాయకులు శేఖర్ 50 మంది రైతులు పాల్గొని జిల్లా కలెక్టర్ వినతిపత్రం ఇవ్వడం జరిగింది. జూరాల ఆయకట్టు రైతాంగానికి శాశ్వత పరిష్కారం కావాలి. జూరాల ప్రాజెక్టు ప్రతి యాసంగి సీజన్లో సాగునీటి సమస్య తీవ్రంగా ఉంటుంది. దీనికి శాశ్వత పరిష్కారం కావాలంటే జూరాల ఆయకట్టు మొత్తం ఎకరాలు లక్ష రెండు వేల ఎకరాలు ఉన్నది. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు రెండు ప్రధాన కాలువలు ఉన్నాయి.1, ఎడమ కాల్వ క్రింద 30 వేల ఎకరాలు. 2,కుడి కుడి కాలువ కింద 70వేల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్నది. ఎడమ ఎడమ కాలువ వనపర్తి జిల్లా లోని ఆత్మకూరు, కొత్తకోట, పెబ్బేరు, వీపనగండ్ల మండలాలు ఎడమ కాలువ పరిధి. కుడి కాలువ జోగులాంబ గద్వాల జిల్లాలోని గద్వాల మండలం ఇటిక్యాల మండలం ఎర్రవల్లి మండలాల పరిధి. రెండు





జిల్లాల రైతులు కలిసి ప్రతి యాసంగిలో ఇదే పరిస్థితి ఉన్నది ఖరీఫ్ లో కూడా వర్షాభావ పరిస్థితులు ఉంటే ఇదే సాగునీటి సమస్యల పరిస్థితులు ఎదురవుతున్నాయి . ఒకసారి రెండు జిల్లాలలోని రైతులందరం కలిసికట్టుగా శాశ్వత పరిష్కారం కొరకు రెండు ఖరీఫ్, యాసంగి సాగునీటి సమస్య తీరడం కొరకు తీవ్రంగా ఆలోచించవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని తెలియజేస్తున్నాం.

# మత్తుకు యువత జీవితం చిత్తు

**-మాదకద్రవ్యాలను నిర్మూలిద్దాం వ్యసనాలకు దూరంగా ఉందాం**

**- డాక్టర్ కొప్పుల విజయ్ కుమార్ సోషల్ జస్టిస్ ఫర్ వారల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ చైర్మన్**



నిర్మల్ జిల్లా కుంటాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్ కుమార్ ఆదేశానుసారం పాఠశాల విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా గౌరవ అతిథిగా విచ్చేసిన కుంటాల ఎస్ఐ భాస్కరాచారి విద్యార్థులను ఉద్దేశించి క్రమశిక్షణతో చదవాలని, ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకొని దాని దిశలో ప్రయాణించాలని, వ్యసనాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథి ఉత్తర తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ సాప పండరి మాట్లాడుతూ యువత మత్తు పానీయాలకు బానిసలు అవుతున్నారని,తల్లిదండ్రుల ఆశలను అడియాశలు చేస్తున్నారని, సిగరెట్, గంజాయి ,గుట్కా, తంబాకు,వైన్,కొకైన్, వైట్నర్ వంటి మత్తు పదార్థాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు."ఆరోగ్యమే మహాభాగ్యమని" విద్యార్థులు లేనిపోని వ్యసనాలకు ఆసక్తి చూపి ఆత్మహత్యలకు కారకులవుతూ తల్లిదండ్రులకు కడుపుకోత మిగిలిస్తున్నరని కావున విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, ఉన్నతమైన ఉత్తమమైన, జీవితాన్ని అనుభవించాలని, తల్లిదండ్రుల కలలను సహకారం చేయాలని తెలియజేశారు.అనంతరం సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నిర్మల్ జిల్లా వైస్ చైర్మన్ లక్ష్మణరావు పటేల్ మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల మాటలు వింటూ శ్రద్ధగా చదువుకొని వారికి సమాజంలో మంచి పేరు తెచ్చిపెట్టే మంచి పిల్లలుగా పేరు తెచ్చుకోవాలని అన్నారు. ప్రజలలో అవగాహన రావాలని సదుద్దేశంతో విద్యార్థులచే గ్రామంలోని ప్రధాన కూడలిలలో భారీ ర్యాలీ తీయడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్ మాట్లాడుతూ విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉత్తర తెలంగాణ చైర్మన్ డాక్టర్ సాప పండరి, జిల్లా వైస్ చైర్మన్ లక్ష్మణరావు పటేల్ ను ఘనంగా అభినందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందము, విద్యార్థిని విద్యార్థులు, గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు

## కుట్టి వెల్లోడి ప్రభుత్వ ఆసుపత్రి భవనాల నిర్మాణం పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పద్మారావు



సికింద్రాబాద్, తెలంగాణ సేన న్యూస్ :

సితాఫలమండీ లో నిర్మిస్తున్న కుట్టి వెల్లోడి ప్రభుత్వ ఆసుపత్రి భవనాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, సూపర్ స్పెషాలిటి ఆసుపత్రిగా తీర్చిదిద్దుతామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ అన్నారు. సితాఫలమండీ కుట్టి వెల్లోడి ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను అధికారులతో కలిసి పద్మారావు గౌడ్ మంగళవారం తనిఖీ చేశారు. నిర్మాణం పనుల్లో భాగంగా కొత్తగా నిర్మిస్తున్న స్లాబ్ నిర్మాణం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.12 కోట్లతో నిర్మిస్తున్న సితాఫలమండీ కుట్టి వెల్లోడి ప్రభుత్వ సివిల్ ఆసుపత్రి భవనాల నిర్మాణానికి గత ప్రభుత్వ హయంలో ప్రత్యేక అనుమతులు సాధించామని, నిర్మాణం పనుల్లో నాణ్యతకు ప్రాముఖ్యతను కల్పించి వేగంగా పూర్తి చేయాలనీ అధికారులకు సూచించారు. కార్పొరేటర్ సామల హేమ, వైద్య శాఖ ఇంజనీరింగ్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణించి పతకాలు సాధించాలి : మంత్రి శ్రీధర్ బాబు

భూపాలపల్లి, తెలంగాణ సేన న్యూస్ :




భూపాలపల్లి జిల్లా కాటారం సబ్ డివిజన్ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల బహుమతుల ప్రధానోత్సవం లో మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ మంథని నియోజకవర్గాన్ని సరస్వతినిలయంగా మార్చడమే తమ లక్ష్యమని అందుకు అందుబాటులోకి వివిధ విద్యాలయాలను స్థాపించినము అలాగే మారుమూల గ్రామాలకి చెందిన విద్యార్థులకు విద్యను అందుబాటులోకి తీసుకొచ్చి వారి జీవితాలను మార్చేవిధంగా కృషి చేస్తామన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని మంత్రి శ్రీధర్ బాబు గారు తెలిపారు అలాగే తల్లితండ్రులు కూడా వారికి ప్రోత్సాహం అందించాలని కోరారు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు అలాగే వయసు తో సంబంధం లేకుండా క్రీడల్లో పాల్గొనడం వలన మానసిక ఉల్లాసం తో పాటు ఆరోగ్యంతో జీవించవచ్చని తెలిపారు.

# గొల్ల కురుమలు ఆర్థికంగా రాజకీయంగా ఎదగాలి.

**-మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్ యాదవ్, డెంటల్ మెడికల్ ఆఫీసర్ వసుమతి యాదవ్.**

**-జీఎంపీఎస్ 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ.**

మహబూబాబాద్ టౌన్ తెలంగాణ సేన జనవరి 07

గొల్ల కురుమలు ఆర్థికంగా రాజకీయంగా అన్ని రంగాలలో ముందుండాలని మహబూబాబాద్ మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్ యాదవ్, మహబూబాబాద్ డెంటల్ మెడికల్ ఆఫీసర్ వసుమతి యాదవ్, సీనియర్ న్యాయవాది కొంపెల్లి వెంకటయ్యలు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం, జిల్లా కోర్టు ముందు గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం (జీఎంపీఎస్) 2025 నూతన సంవత్సర క్యాలెండర్ను ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పయ్యావుల మల్లయ్య, బొల్లం అశోక్ లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గొల్ల కురుమలను విస్మరించకుండా ప్రోత్సాహం అందిస్తూ గొల్ల కురుమలు ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గొల్ల కురుమలు ఉద్యోగ వ్యాపార రంగాలతోపాటు రాజకీయంగా కూడా చాలా వెనుకబడి ఉన్నారని... రానున్న రోజుల్లో గొల్ల కురుమలు అన్ని రంగాలతో పాటు రాజకీయంగా ఎదగాలని




ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు కౌన్సిలర్ ఎడ్ల వేణు యాదవ్, సీనియర్ నాయకులు ఆవుల శ్రీనివాస్, న్యాయవాదులు సంద కృష్ణ, కాసాని మౌనిక, దూదిమెట్ల మహేష్, వల్లపు యాదగిరి, గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం నాయకులు గండ్రకోటి కుమార్, అమడగాని రఘు, కొమ్మనబోయిన యాకయ్య, గుదె రమేష్, ఉగ్గుల అశోక్, వెంకట్ యాదవ్, దామోదర్, రేఖ నవీన్, బట్టు శేఖర్, కొత్తపల్లి అశోక్, సోమనబోయిన లింగన్న, ఎడ్ల శీను, దాసరి భరత్, సంద వెంకన్న, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి ఎంఈఓ అనితాదేవి కి వినతి పత్రం అందజేసిన వవీరబాబు

మహబూబాద్ రూరల్ మరిపెడ తెలంగాణ సేన జనవరి 7

మరిపెడ మండల వ్యాప్తంగా యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో సర్వే నిర్వహించడం జరిగిందని యుఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి పెద్ద బోయిన వీరబాబు మాట్లాడుతూ అన్నారు సర్వే నిర్వహించిన అనంతరం మండల వ్యాప్తంగా ఉన్నటువంటి పాఠశాలలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుండా ప్రతిరోజు ఉదయం గంటన్నర పాటు లేటుగా ఉపాధ్యాయులు పాఠశాలకు వస్తున్నారు సాయంత్రం గంటన్నర పాటు ముందుగా వెళుతున్నారు లోకల్ లో ఉన్నటువంటి ఉపాధ్యాయులు సొంత పనులకు చేసుకుంటున్నారు విద్యార్థులు విద్యకు దూరమయ్యే అవకాశం ఉందని ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కోసం కృషి చేయాలని యు ఎస్ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో మరిపెడ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంఈఓ ఆఫీస్ లో ఎంఈఓ అనితాదేవికి వివిధ ప్రభుత్వ పాఠశాలలో సమయపాలన పాటించని ఉపాధ్యాయుల పేర్లను వారికి వివరించడం జరిగింది మరిపెడ మండలంలో ఒక పాఠశాల ఉపాధ్యాయుడు ఉదయం లేటుగా రావడం వల్ల విద్యార్థులు గేటు దూకి స్కూల్ ఆవరణలోకి ప్రవేశించిన సందర్భంలో అక్కడికి యుఎస్ఎఫ్ఐ నాయకులు వీరబాబు వెళ్లి విద్యార్థులని గేటు ఎందుకు దూకారు అని అడిగితే మా సారు రాలేదు లేటుగా వస్తారు అందుకోసమే గేటు దూకాం అని విద్యార్థులు వివరణ ఇచ్చారు వీరబాబు మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారికి మండల విద్యాశాఖ అధికారికి పాఠశాల ఉపాధ్యాయుడు లేకపోవడం వల్ల విద్యార్థులు గేట్లు దూకి పాఠశాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడతా ఉంది కాలుకాని చెయ్యి కానీ ఇరుగుతే ఎవరూ బాధ్యులు అని వీరబాబు అన్నారు పేద





మధ్యతరగతి కుటుంబాలకు చెందినటువంటి విద్యార్థులు మాత్రమే ప్రభుత్వ పాఠశాలలో అభ్యసిస్తారు విద్యార్థులకు ఎలాంటి నష్టం జరిగిన పాఠశాల యాజమాన్యాలు బాధ్యత వహించాలని వీరబాబు అన్నారు ఎంఈఓ అనిత దేవి వివరణ ఇస్తూ పాఠశాల హెడ్మాస్టర్ కు శోకస్ నోటీసులు జారీ చేశాము కాకుండా చూస్తామని వారు అన్నారు విద్యాశాఖ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని యుఎస్ఎఫ్ఐ వీరబాబు మాట్లాడుతూ అన్నారు ఇలాంటి మళ్ళీ పునరత్వం అయితే ఆ పాఠశాల ముందు ధర్నాలు నిర్వహిస్తామని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ మరిపెడ మండల నాయకులు యశ్వంత్ సందీప్ కుమార్ సన్నీ అనీలు కిరణ్ మోహన్ అఖిలేష్ నిఖిల్ తదితరులు పాల్గొన్నారు

# పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించాలి

**-రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి**


మధ్యాహ్న భోజన కార్మికులకు హామీలు అమలు చేయాలి. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒక సంవత్సరం గడిచినా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదు. ప్రతి కార్మికురాలికి పెన్షన్, పిఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, తదితర సౌకర్యాలు కల్పించాలి. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించొద్దు. హెల్త్ కార్డులు, యూనిఫామ్ లు, ఐడి కార్డులు ఇవ్వాలి. ప్రభుత్వం ప్రతినెల వేతనాలు, బిల్లులు చెల్లించే విధంగా చూడాలి. మెనూ చార్జీలు 1 నుండి 5వ తరగతి వరకు పది రూపాయలు, 6 నుండి 10వ తరగతి వరకు ఇరువై రూపాయలు పెంచాలి. ప్రభుత్వం ఇచ్చే ఇందిరమ్మ ఇండ్లు, ఇళ్లస్థలాలు మధ్యాహ్న భోజన కార్మికులకు ఇవ్వాలి. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ఇతర సమస్యలు పరిష్కరించాలి.

# బిజినెస్




## రతన్ టాటా 'మోడల్' రద్దు చేసి.. టాటా గ్రూప్.. కొత్త రోడ్ మ్యాప్..

దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక సంస్థ అయిన టాటా గ్రూప్ ఏళ్ల నాటి సంప్రదాయంలో పెను మార్పు తెచ్చింది. రతన్ టాటా మరణానంతరం అనాదిగా వస్తున్న సంప్రదాయానికి స్వస్తి పలికింది. ఇకపై రతన్ టాటా 'మోడల్'పై కంపెనీ పనిచేయదు. టాటా గ్రూప్ మాజీ చైర్మన్ రతన్ టాటా వ్యాపార నమూనాకు భిన్నంగా ఇప్పుడు తన వ్యాపార పద్ధతుల్లో పెనుమార్పు తీసుకురాబోతోంది. అందుకు అనుగుణంగా ఇప్పటికే కొత్త రోడ్‌మ్యాప్ సిద్ధం చేసింది. దీని ప్రకారం టాటా గ్రూప్ కింద ఉన్న కంపెనీలు తమ అప్పులు, బాధ్యతలను స్వయంగా నిర్వహించుకోవాల్సి ఉంటుంది. ఒక నివేదిక ప్రకారం, టాటా సన్స్ గ్రూప్స్, టాటా డిజిటల్, టాటా ఎలక్ట్రానిక్స్, ఎయిర్ ఇండియా వంటి కొత్త కంపెనీలను స్వతంత్రంగా నిర్వహించుకోవాలని టాటా గ్రూప్ కోరింది. బ్యాంకులకు ఇప్పటికే కంఫర్ట్ లేట్, క్రాస్-డిఫాల్ట్ క్లాజులను అందించే పద్ధతిని నిలిపివేయాలని సమాచారం ఇచ్చింది.

**టాటా గ్రూప్ నిర్ణయం**

కొత్త రోడ్ మ్యాప్ నిర్ణయాన్ని బ్యాంకులకు తెలియజేయడంతో.. టాటా గ్రూప్‌కు లెటర్ ఆఫ్ కంఫర్ట్, క్రాస్ డిఫాల్ట్ క్లాజ్‌ల జారీని బ్యాంకులు నిలిపివేశాయి. కంపెనీ కొత్త వెంచర్లకు భవిష్యత్ మూలధన కేటాయింపులు, ఈక్విటీ పెట్టుబడి అంతర్గత వనరుల ద్వారా జరుగుతాయని టాటాసన్స్ బ్యాంకులకు తెలిపింది. అంటే కంపెనీలోని ఒక్కో కేటగిరీలో ఉన్న ప్రముఖ లిస్టెడ్ కంపెనీ మాత్రమే హోల్డింగ్ ఎంటిటీగా వ్యవహరిస్తుందని టాటాసన్స్ బ్యాంకులకు స్పష్టం చేసింది.


**20వేల కోట్ల రుణం చెల్లించారు**

టాటా సన్స్ గతేడాది స్వచ్ఛందంగా ఆర్‌బీఐకి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను సమర్పించింది. అన్‌లిస్టెడ్‌గా ఉ ండటానికి కంపెనీ రూ. 20 వేల కోట్లకు పైగా రుణాన్ని చెల్లించింది. కొత్త వ్యాపారానికి ప్రధానంగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ నుంచి నిధులు అందుతాయని విశ్వసిస్తున్నారు. ఈ మార్పు తర్వాత భవిష్యత్తులో గ్రూప్‌లోని కంపెనీలకు నిధులు ప్రధానంగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ నుంచి వచ్చే డివిడెండ్ ద్వారా అందనున్నాయి.

**టాటాసన్స్‌పై ప్రభావం**

ఈ నిర్ణయం టాటాసన్స్‌పై పెద్దగా ప్రభావం చూపదని ఆర్థిక విశ్లేషకుల అంచనా. ఎందుకంటే టాటా స్టీల్, టాటా మోటార్స్, టాటా పవర్, టాటా కన్స్యూమర్ వంటి లిస్టెడ్ కంపెనీలు తమ క్యాపిటల్ స్వంతంగానే నిర్వహిస్తున్నాయి. అయితే, టాటా సన్స్ గణనీయమైన వాటాను కలిగి ఉన్న హోల్డింగ్ కంపెనీలను ఈ చర్య ప్రభావితం చేయవచ్చు. టాటా గ్రూప్ పెద్ద వాటాదారుగా ఉ న్నందున బ్యాంకులు ఈ కంపెనీలకు స్పష్టమైన హామీ లేకుండా రుణాలు అందజేస్తాయి. గ్రూప్ కింద ఉన్న ప్రముఖ అనుబంధ సంస్థలు అంతర్గత ఈక్విటీ వనరులపై దృష్టి సారిస్తే భవిష్యత్‌లో ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందించవచ్చనే లక్ష్యంతో టాటా గ్రూప్స్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## ఆరంభ లాభాలు ఆవిరి.. ఒడిదుడుకుల్లో దేశీయ సూచీలు..




వైరస్ ఆందోళనల నేపథ్యంలో సోమవారం భారీ నష్టాలు చవిచూసిన దేశీయ సూచీలు మంగళవారం లాభాలతో ప్రారంభమయ్యాయి. భారీ లాభాల్లోకి దూసుకెళ్లాయి. అయితే కొద్ది సేపటికే ఆ లాభాలు ఆవిరయ్యాయి. కనిష్టాల వద్ద కొనుగోళ్లు సాగినప్పటికీ మదుపర్లు అప్రమత్తత పాటిస్తుండడం మార్కెట్లను కుంగదీస్తోంది. దీంతో లాభాలతో ప్రారంభమైన సూచీలు ఒడిదుడుకులకు లోనవుతున్నాయి. ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప లాభాల్లో కొనసాగుతున్నాయి. సోమవారం ముగింపు (77, 964)తో పోల్చుకుంటే మంగళవారం ఉదయం 55 పాయింట్ల స్వల్ప లాభంతో మొదలైన సెన్సెక్స్ క్షణాల్లోనే మరింత లాభాల్లోకి దూసుకెళ్లింది. ఏకంగా 500 పాయింట్లకు పైగా లాభపడి 78, 452వద్ద గరిష్టానికి చేరుకుంది. అయితే ఆ తర్వాత ఆరంభ లాభాలను కోల్పోయింది. 500 పాయింట్లకు పైగా కోల్పోయి 77, 956 వద్ద కనిష్టానికి చేరుకుంది. ప్రస్తుతం ఉదయం పది గంటల సమయంలో 5 పాయింట్ల స్వల్ప లాభంతో 77, 970 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే లాభాలతో రోజును ప్రారంభించింది. ప్రస్తుతం ఉదయం పది గంటల సమయంలో 25 పాయింట్ల లాభంతో 23, 639 వద్ద కొనసాగుతోంది.

సెన్సెక్స్‌లో బయోకాన్, ఎన్‌సీసీ, ఓఎన్‌జీసీ, యూపీఎల్ షేర్లు లాభాల బాటలో సాగుతున్నాయి. పీవీఆర్ ఐనాక్స్, జొమాటో, ఇన్ఫోఎడ్జ్, మహానగర్ గ్యాస్ షేర్లు నష్టాల్లో ట్రేడ్ అవుతున్నాయి. మిడ్ క్యాప్ ఇండెక్స్ 251 పాయింట్ల లాభంలో కొనసాగుతోంది. బ్యాంక్ నిఫ్టీ 129 పాయింట్ల లాభంలో ఉంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 85.67గా ఉంది.

## రూ.6999లకే మోటో జీ 05 స్మార్ట్ ఫోన్..



ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ మోటరోలా తన మోటో జీ05 ఫోన్‌ను భారత్ మార్కెట్లో మంగళవారం ఆవిష్కరించింది. మీడియాటెక్ హెలియో జీ68 ఎస్వోసీ ప్రాసెసర్ ఉంటుంది. 18వాట్ల వైర్డ్ చార్జింగ్ మద్దతుతో 5200 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంటుంది. 50 -మెగా పిక్సెల్స్ మెయిన్ కెమెరా, సెల్ఫీలూ వీడియో కాల్స్ చేయడానికి 8- మెగాపిక్సెల్ కెమెరా ఉ ంటుంది.మోటో జీ05 ఫోన్ 4జీబీ ర్యామ్ విత్ 64 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.6,999లకు సొంతం చేసుకోవచ్చు. ఫ్లిప్‌కార్ట్, మోటరోలాఇండియా. వెబ్ సైట్ ద్వారా సొంతం చేసుకోవచ్చు. ఈ నెల 13 నుంచి ఆఫ్‌లైన్ రిటైల్ స్టోర్లలో లభిస్తాయి. ఫారెస్ట్ గ్రీన్, ఫ్లమ్ రెడ్ కలర్ ఆప్షన్లలో లభిస్తుంది. రిలయన్స్ జియో యూజర్లు కొనుగోలు చేస్తే రూ.2,000 క్యాష్ బ్యాక్, రూ.3000 వరకూ అదనపు ఓచర్ బెనిఫిట్లు, జియో యూజర్లు రూ.449 ప్రీపెయిడ్ ప్లాన్ పొందొచ్చు.

మోటో జీ05 ఫోన్ 90 హెర్ట్జ్ రీఫ్రెష్ రేటు, 1000 నిట్స్ పీక్ బ్రైట్ నెస్, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ ప్రొటెక్షన్ ఉంటాయి. మీడియాటెక్ హెలియో జీ81 ఎక్స్‌ట్రీమ్ ఎస్వోసీపై పని చేస్తుంది. వర్చువల్ ర్యామ్ మరో 12 జీబీ పొడిగించుకోవచ్చు. కానీ ఫోన్ స్టోరేజీ మైక్రో ఎస్డీ కార్డు సాయంతో ఒక టిగా బైట్ వరకూ పెంచుకోవచ్చు. ఆండ్రాయిడ్ 15 బేస్డ్ హెల్లో యూఐ స్కిన్ వర్షన్ పై పని చేస్తుందీ ఫోన్.

మోటో జీ05 ఫోన్ 90 హెర్ట్జ్ రీఫ్రెష్ రేటుతోపాటు 1000 నిట్స్ పీక్ బ్రైట్ నెస్, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 3 ప్రొటెక్షన్‌తోపాటు 6.67 అంగుళాల హెచ్‌డీం (720ఐ1612 పిక్సెల్స్) ఎల్‌సీడీ స్క్రీన్ ఉంటుంది. 50-మెగా పిక్సెల్ మెయిన్ రేర్ కెమెరా విత్ క్వాడ్ పిక్సెల్ టెక్నాలజీ, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 8- మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరా ఉంటాయి.

మోటో జీ05 ఫోన్ 18వాట్ల వైర్డ్ చార్జింగ్ మద్దతుతో 5200 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో వస్తుంది. డ్యుయల్ 4జీ ఎల్‌టీఈ, బ్లూటూత్ 5.0, ఎఫ్ఎం రేడియో, జీపీఎస్, ఏ-జీపీఎస్,గ్లోనాస్ గెలీలియో, వై-ఫై, 3.5ఎంఎం ఆడియో జాక్స్, యూఎస్బీ టైప్-సీ పోర్ట్ ఉంటుంది. సెక్యూరిటీకోసం సైడ్ మౌంటెడ్ ఫింగర్ ప్రింట్ సెన్సర్ ఉంటాయి.

## కేంద్ర బడ్జెట్ 2025-26లో వీటిపై ఫోకస్ చేయాలి



వచ్చే యూనియన్ బడ్జెట్ 2025-26లో (%ఎబుస్త్రవ్% 2025) భారతదేశంలో ఉద్యోగాల సృష్టి, ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం వంటి అంశాలపై ఫోకస్ చేయాలని %జ××% (కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) కోరింది. యూనియన్ బడ్జెట్ 2025-26లో ముఖ్యంగా ఉపాధి కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించింది. ఈ బడ్జెట్ ద్వారా భారతదేశంలో పెరిగిన జనాభా డివిడెండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని, యువతను అందులో భాగం చేయాలని కోరింది.

**దేశంలో యువ జనాభా..**

%జ××% నివేదిక ప్రకారం భారతదేశం ప్రస్తుతం 145 కోట్ల జనాభాతో ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగి ఉంది. ఈ సమాహారంలో 29 సంవత్సరాల మధ్య వయస్సు వారి జనాభా ఎక్కువగా ఉంది. ఇది ఒక చరిత్రాత్మక అవకాశాన్ని సూచిస్తుందని ఈ సందర్భంగా నివేదిక తెలిపింది. 2050 నాటికి 133 మిలియన్ల మంది యువత పని చేసే అవకాశం ఉందన్నారు. కాబట్టి ఈ యువతను ఉత్పాదకంగా వాడుకోవడం దేశానికి అత్యంత అవసరమవని రిపోర్ట్ స్పష్టం చేసింది.

**యువతకు అవకాశాలు**

అయితే సీఐఐ అభిప్రాయానికి అనుగుణంగా రాబోయే బడ్జెట్ ద్వారా ఉపాధి కల్పనను ప్రోత్సహించడానికి పలు పథకాలను ప్రకటించే అవకాశం ఉంది. ఇందులో ప్రత్యేకంగా యువతకు సంబంధించిన ఉపాధి సంబంధిత ప్రోత్సాహక పథకాలు ఉ ండనున్నాయి. తద్వారా ఉద్యోగాల విషయంలో ప్రకటనలు వచ్చే ఛాన్స్ ఉంది. దీంతోపాటు సమగ్ర జాతీయ ఉపాధి విధానం, వివిధ మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో అమలులో ఉన్న ఉపాధి కల్పన పథకాలను యువతకు అవకాశాలు పెంచడానికి దోహదపడతాయని నివేదిక తెలిపింది.

**ప్రత్యేక మినహాయింపులు**

సీఐఐ తన డిమాండ్‌లలో కొత్త ఉపాధిని ప్రోత్సహించడానికి సెక్షన్ 80%జీజీూూా% స్థానంలో కొత్త విభాగం పెట్టాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ఇది పన్ను చెల్లింపుదారులకు ప్రత్యేక రాయితీ స్కీమ్ అందించడానికి దారితీస్తుంది. అలాగే కొత్త నియమాల ద్వారా మూడు సంవత్సరాల పాటు కొత్త ఉ ద్యోగాలకు సంబంధించిన జీతానికి ప్రత్యేక మినహాయింపును అనుమతించవచ్చని పేర్కొన్నారు. ఇది వ్యాపారాలు, వృత్తిని కొనసాగిస్తున్న పన్ను చెల్లింపుదారులకు ప్రయోజనాన్ని పొందడంలో తోడ్పడుతుంది.

**కృషి చేయాలి**

%జ××% పారిశ్రామిక వర్గాల నియామకాలను ప్రోత్సహిస్తూ, యువతను వినియోగించుకోవడం అవసరం అని ప్రస్తావించింది. ఇది భారతదేశంలో ఉద్యోగాల సృష్టికి, ఆర్థిక పరంగా ప్రగతి సాధించడంలో కీలక పాత్ర పోషిస్తుందని వెల్లడించింది. భారతదేశంలో ప్రభుత్వ విభాగం, ప్రైవేట్ పరిశ్రమలు, ఇతర వ్యాపార సంస్థలు వంటి అనేక ప్రాంతాల్లో యువతకు అవకాశాలు అందించడంలో కృషి చేయాలని నివేదిక ప్రస్తావించింది.

రాబోయే బడ్జెట్ 2025-26లో ఉద్యోగాల సృష్టిని ప్రాముఖ్యతతో చూడటం ద్వారా దేశాన్ని ఆర్థికంగా మరింత ముందుకు తీసుకెళ్లవచ్చని రిపోర్ట్ అంచనా వేసింది. భవిష్యతుపై దృష్టి సారించడం, ఉద్యోగాలను సృష్టించడం, ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం అంటే ఇది సమాజానికి ఒక మంచి చేయడమేనని %జ××% తెలిపింది. ఈ క్రమంలో వ్యూహాత్మక అభివృద్ధికి దారితీసే మార్గాలలో యువతకు అవకాశం కల్పించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని అభిప్రాయపడింది.

## వివిధ బ్యాంకుల్లో లోన్లు తీసుకుంటున్నారా.. ఇక నుంచి కష్టమే

అవసరం ఉందని తీర్చే సామర్థ్యం ఉన్నా లేకున్నా అందినకాడికి అప్పులు చేసేవారు ఇకపై జాగ్రత్తగా ఉండాల్సిందే. ఫైనాన్స్ లోన్లతో పోలిస్తే వడ్డీ రేట్లు తక్కువగా ఉంటాయని బ్యాంకుల్లో లోన్లు తీసుకునేందుకు ప్రాధాన్యం ఇస్తుంటారంతా. వ్యాపారాలు చేసేవారైతే ఒకేసారి వివిధ బ్యాంకుల్లో వ్యక్తిగత రుణాలు తీసుకుంటూ ఉంటారు. కొత్త ఏడాది నుంచి అలా తీసుకోవడం అసాధ్యమే. కొత్త ఏడాదిలో రిజర్వ్ బ్యాంక్ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) జారీ చేసిన నిబంధనలే అందుకు కారణం. కొత్త నిబంధనల ప్రకారం తక్కువ వ్యవధిలోనే పలు బ్యాంకుల్లో లోన్లు పొందే అవకాశం ఉండకపోవచ్చు. ఇప్పటివరకూ బ్యాంకులు నెలకు ఒకసారి మాత్రమే ఆర్‌బీఐకి రుణగ్రహీతల క్రెడిట్ రికార్డులు పంపించేవి. ఇక నుంచి 15 రోజులకు ఒకసారి తప్పనిసరిగా పంపించాలని ఆర్‌బీఐ అన్ని బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసింది.

ఆర్‌బీఐ కొత్త నిబంధనల ప్రకారం, ప్రతి 15 రోజులకు ఒకసారి రుణగ్రహీత క్రెడిట్ రికార్డులు అప్‌డేట్ అవుతాయి. అందువల్ల, లోన్లు జారీ చేసే సమయంలో బ్యాంకులు మునుపటి కంటే క్షుణ్ణంగా తనిఖీలు చేసే అవకాశం లభిస్తుంది. ఎంత రుణం తీసుకున్నారు..ఎక్కడెక్కడ తీసుకున్నారు అనే విషయంపై స్పష్టత వస్తుంది. తాహతుకు మించి ఒకేసారి పలు బ్యాంకుల్లో లోన్లు పొందిన వ్యక్తులకు అప్పు ఇచ్చేందుకు నిరాకరించవచ్చు.






గతంలో ఆర్‌బీఐకి నెలరోజులకు ఒకసారే క్రెడిట్ రిపోర్టులు పంపేవి ఆర్థిక సంస్థలు. అందువల్ల రుణగ్రహీతల బకాయిల చెల్లింపులు, ఎగవేతల సమాచారం త్వరగా తెలిసేది కాదు. దాదాపు 40 రోజులు ఆలస్యమయ్యేది. ఇప్పుడు గడువును 15 రోజులకు కుదించడం వల్ల బకాయిలు ఆలస్యంగా చెల్లించేవారు తగ్గే అవకాశం ఉంది. బ్యాంకులకూ కచ్చితమైన సమాచారం అంది సరైన వ్యక్తులకే రుణాలు ఇవ్వగలిగే సౌకర్యం లభిస్తుందని.. చెల్లించే సామర్థ్యం లేకున్నా అధికరుణాలు పొందేవారికి అడ్డుకట్ట వేసినట్టు అవుతుందని ఆర్థిక నిపుణులు అంటున్నారు.

## ఇక వెండి ఆభరణాలపై కూడా హాల్‌మార్కింగ్!

**-ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న కేంద్రం**

న్యూఢిల్లీ, జనవరి 6 : వెండిపై కూడా హాల్‌మార్కింగ్‌కు సిద్ధమవుతున్నది కేంద్ర ప్రభుత్వం. ఇప్పటికే బంగారు, ఆభరణాలపై హాల్‌మార్కింగ్ విజయవంతంగా పూర్తికావడంతో కన్స్యూమర్ల నుంచి వస్తున్న డిమాండ్‌తో వెండితోపాటు వెండి కళాఖండాలపై కూడా హాల్‌మార్కింగ్ తప్పనిసరి చేయాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. దీంతో వీటిపై కూడా హాల్‌మార్కింగ్‌ను బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) అమలు చేయాలని కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోష్ సూచించారు. వినియోగదారుల నుంచి డిమాండ్ అధికంగా వస్తున్నదని, దీనిని వెంటనే అమలులోకి తేవాలని 78వ బీఐఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి వెల్లడించారు. ఇప్పటికే ఈ దిశగా పనులు ప్రారంభమయ్యాయని, బీఐఎస్ ద్వారా వాటాదారులతో సంప్రదింపులు, సాధ్యాసాధ్యాలపై పరిశీలించిన తర్వాత ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని మంత్రి వ్యాఖ్యానించారు.వెండిపై హాల్‌మార్కింగ్‌పై వాటాదారుల నుంచి, అటు కన్స్యూమర్, ఆర్నమెంట్ డీలర్ల నుంచి సమాచారాన్ని సేకరించాలని బీఐఎస్‌కు మంత్రి సూచించారు. దేశవ్యాప్తంగా అమ్ముడవుతున్న ఆభరణాల్లో 90 శాతం హాల్‌మార్కింగ్ కలిగినవని, 44.28 కోట్ల బంగారు ఆభరణాలు హాల్‌మార్కింగ్‌తో తయారైనవి అమ్ముడయ్యాయని మంత్రి చెప్పారు. దీనిపై బీఐఎస్ డైరెక్టర్ జనరల్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ..వచ్చే మూడు నుంచి ఆరు నెలల్లో వెండిపై హాల్‌మార్కింగ్‌ను అమలులోకి తేవడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. వెండి నాణ్యతను గుర్తించే విధానంపై ఇప్పటికే పలుదఫాలుగా చర్చలు జరిపినట్లు, ఆరు డిజిట్ అల్ఫాన్యూమెరిక్ కోడ్ కలిగిన నంబర్‌ను ప్రింటింగ్ వేసి ఇవ్వనున్నట్లు చెప్పారు. జూన్ 2021లో ప్రవేశపెట్టిన గోల్డ్ హాల్‌మార్కింగ్ విజయవంతంగా అమలు చేయబడుతున్నదని, ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 361 జిల్లాలను కవర్ చేయగలిగామన్నారు.

# చక్కని ఆరోగ్యం

## డిప్రెషన్‌ను జయించేందుకు సులువైన మార్గం



మనసుకు బాధ కలిగినా భావోద్వేగాలు అణిచి పెట్టుకోవటం అందరూ చేసేదే. పని ఒత్తిడి, ఆర్థిక సమస్యలు, భయపట్టే సంఘటనలు, ఇతరులతో పంచుకోలేని ఇబ్బందులు..ఇలా ఏదైనా కావచ్చు. ఇవన్నీ అలానే దాచుకుంటూ పోతే డిప్రెషన్ బారిన పడతారు. ఒక్కసారి ఈ సమస్యలో చిక్కుకుంటే బయటపడటం అంత సులభం కాదు. ఆత్మహత్య చేసుకునేందుకు ప్రేరేపించే ముఖ్య కారణాల్లో ఒకటి డిప్రెషన్. మనసులో మొలకెత్తే ఈ సమస్య తర్వాత శరీరంలోని అణువణువునూ ప్రభావితం చేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది దీని వల్ల మానసికంగా కుంగుబాటుకు గురయ్యి అనారోగ్యం పాలవుతున్నారు. నలుగురిలో కలవలేక, బయటపడలేక లోలోపలే కుమిలిపోతూ సమస్యను తీవ్రం చేసుకుంటున్నారు. తాజా పరిశోధన ప్రకారం కొన్ని రకాల పండ్లు, కూరగాయలు రోజువారీ ఆహారంలో భాగం డిప్రెషన్ సమస్య నుంచి బయటపడవచ్చని రుజువైంది. మానసిక రుగ్మతలతో బాధపడేవారికి ఇది ఉపశమనం కలిగించే వార్తే.

డిప్రెషన్‌ను ఓడించాలంటే ముందుగా విచారాలన్ని పక్కనపెట్టి తినే ఆహారాన్ని ఆస్వాదించడం అలవాటు చేసుకోండి. అప్పుడు మానసిక ప్రశాంతత పొందేందుకు రిహాబిలిటేషన్ సెంటర్ల చుట్టూ తిరగాల్సిన పనుండదు. ఎందుకంటే, ఆహారంలో తగిన మొత్తంలో పండ్లు, కూరగాయలను చేర్చుకునే వ్యక్తుల్లో డిప్రెషన్ వచ్చే ప్రమాదం గణనీయంగా తగ్గిందని పరిశోధకులు గుర్తించారు. బ్రిటన్‌లో నిర్వహించిన పరిశోధనలో 18 – 60 సంవత్సరాల వయస్సు గల 5,000 మందికి పై అధ్యయనం చేసి ఈ విషయం కనుగొన్నారు. పరిశోధకుల అభిప్రాయం ప్రకారం, పండ్లు, కూరగాయలలోని యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు మరియు ఖనిజాలు ఒత్తిడిని తగ్గించడంలో, మానసిక స్థితిని మెరుగుపరచడంలో సహాయపడతాయి. ముఖ్యంగా విటమిన్ సి, ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు మనస్సును ప్రశాంతంగా చేసి డిప్రెషన్ లక్షణాలను తగ్గిస్తాయి.

**డైట్‌లో మార్పుతో డిప్రెషన్‌కు చికిత్స:**

మెడిసిన్, థెరపీతో పాటు డైట్‌పై కూడా శ్రద్ధ వహిస్తే డిప్రెషన్‌తో పోరాడటం సులభం అవుతుందని నిపుణులు అంటున్నారు. ఫాస్ట్ ఫుడ్, ప్రాసెస్ చేసిన ఆహారాన్ని నివారించి పండ్లు, కూరగాయలు అధికంగా ఆహారంలో చేర్చుకుంటే శరీరంలో సెరోటోనిన్ స్థాయి పెరుగుతుంది. ఇది మానసిక స్థితిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఇవి శరీరంతో పాటు మనసునూ ఆరోగ్యంగా ఉంచుతాయి. మీరు డిప్రెషన్‌తో బాధపడుతున్నట్లయితే, ఈ రోజు నుంచే మీ ఆహారంలో తాజా పండ్లు, కూరగాయలను చేర్చుకోండి. సంతోషకరమైన జీవితాన్ని ఆస్వాదించండి.

## మలబద్ధకం సమస్య పోవాలంటే.. ఇది తాగండి..



ఇదివరకూ మలబద్ధకం సమస్య ఎక్కువగా పెద్దవారిలోనే కనిపిస్తుండేది. ఇప్పుడు చిన్నవయసు నుంచే దాదాపు ప్రతి వ్యక్తికి ఏదో ఒక సమయంలో ఎదురవుతోంది. అయితే సిగ్గు కారణంగా దాని గురించి బహిరంగంగా మాట్లాడరు. గంటల తరబడి ఒకేచోట కూర్చోవడం వల్ల శారీరక శ్రమ తగ్గడం, నీళ్లు సరిగా తాగకపోవడం, ఆలస్యంగా భోజనం చేయడం, రాత్రి ఎక్కువసేపు మేల్కోవడం తదితర కారణాల వల్ల జీర్ణక్రియ వ్యవస్థ దెబ్బతింటుంది. కడుపు శుభ్రం కాకపోతే పేగు కదలికలలో ఇబ్బంది ఏర్పడి మలబద్ధకం సమస్య ఉత్పన్నమవుతుంది. ఒక నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 22 శాతం మంది మలబద్ధకం సమస్యతో బాధపడుతున్నారు. సాధారణంగా మొదలయ్యే ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే తీవ్రమైన అనారోగ్య సమస్యలను కలిగిస్తుంది. చాలా కాలం పాటు కొనసాగితే అల్సర్లు, పైల్స్ వంటి ఇతర తీవ్రమైన సమస్యలకు దారితీస్తుంది. అందుకే తొలినాళ్లలోనే నివారణకు ప్రయత్నిస్తే ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తవు. ఇంట్లోనే చేసుకున్న ఈ డ్రింక్ రోజూ తాగారంటే మలబద్ధకం సమస్య ఇట్టే మాయమైపోతుంది.

మలబద్ధకం సమస్య ఏ వయసు వారికైనా సంభవించవచ్చు. జీర్ణవ్యవస్థ బలహీనంగా ఉన్నవారిలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. సకాలంలో చికిత్స చేయకపోతే, ఇది మరింత జటిలంగా మారుతుందని వైద్యులు అంటున్నారు. అందుకే శరీరంలోని అన్ని వ్యవస్థలను దెబ్బతీయకముందే ముందునుంచే జాగ్రత్త వహించాల్సిన అవసరముంది. మీరు మలబద్ధకం సమస్య నుంచి ఉపశమనం పొందాలనుకుంటే ఈ రెసిపీని ప్రయత్నించి చూడండి.

**ఎండుద్రాక్ష నీరు**


మలబద్ధకం సమస్య తొలగించే ది బెస్ట్ హోం రెమెడీ ఎండుద్రాక్ష నీరు. మీరు ఇంట్లోనే దీన్ని సులభంగా తయారు చేసుకోవచ్చు. ఇందులో అధిక మొత్తంలో ఫైబర్ ఉంటుంది. ఇది కడుపుని శుభ్రపరచడంలో సహాయపడుతుంది.

**ఎండుద్రాక్ష నీరు ఇలా చేయండి..**

1. ముందుగా నాలుగైదు ఎండు ద్రాక్షలను తీసుకోవాలి.
2. వాటిని ఒక గిన్నెలో తీసుకుని రాత్రంతా నీటిలో నానబెట్టండి.
3. ఉదయం పూట మొదటగా ఈ నానబెట్టిన ఎండు ద్రాక్షలను తిని అందులోని నీటిని తాగాలి.

ఇది కాకుండా, మలబద్ధకాన్ని నివారించడానికి కొన్ని ఇతర చిట్కాలు పాటించవచ్చు. ఉదయం లేవగానే ఒక గ్లాసు గోరువెచ్చని నీరు తాగడం, క్రమం తప్పకుండా వ్యాయామం, పీచు పదార్థాలను ఆహారంలో ఎక్కువగా తీసుకోవడం, తగినంత నీరు త్రాగడం వంటివి చేయండి. ఉప్పు, నూనెల మోతాదులు తగ్గించడం కూడా ముఖ్యం.

## అరటి తొక్కతో మొహంపై రుద్దితే.. చర్మానికి మంచిదేనా?



అరటిపండు తొక్కతో మొహంపై రుద్ది మసాజ్ చేస్తే చర్మంపై ఉన్న ముడుతలు తొలిగిపోయి కాంతివంతంగా మారుతుందని అంటుంటారు. ముఖంపై ఉండే చర్మం బిగుతుగా మార్చి నిత్యయవ్వనంగా ఉంచేందుకు ఈ సహజ చిట్కా ఉపయోగపడుతుందని అమ్మాయిల నమ్మకం. తమ చర్మ సౌందర్య రహస్యం ఇదే అంటూ ఈ మధ్య సోషల్ మీడియాలో బ్యూటీ ఇన్‌ఫ్లుయెన్సర్లు తరచూ చెప్పడం కూడా వినే ఉంటారు. దీంతో వేలు ఖర్చు చేసి తరచూ బొటాక్స్ ట్రీట్‌మెంట్ తీసుకునే కంటే ఇది ఫాలో కావడం బెటరని భావిస్తుంటారు అమ్మాయిలు. అయితే, అరటిపండు తొక్కతో ఫేషియల్ నిజంగానే బొటాక్స్ ట్రీట్‌మెంట్‌కు ప్రత్యామ్నాయంగా పనిచేస్తుందా? ఇది చర్మాన్ని కాంతివంతంగా ఉంచడంలో తోడ్పడుతుందా? ఇలా చేయడం మంచిదేనా? చర్మసంబంధ నిపుణులు అరటిపండు ఫేషియల్ గురించి ఏం చెబుతున్నారనే విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం..

అరటితొక్క ఫేషియల్‌పై ఆయుర్వేద ఉత్పత్తుల సంస్థ అమ్ము బ్యూటీ బ్రాండ్ వ్యవస్థాపకురాలు ఆరీఫా తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఇటీవలి వీడియో వైరల్ మారింది. ఆ క్లిప్‌లో, "మీకు బొటాక్స్ అవసరం లేదు. అరటిపండు తొక్క చాలు. అరటితొక్కతో మొహంపై రుద్ది 10 నిమిషాలు అయ్యాక గోరువెచ్చని నీటితో కడిగేసుకోండి. మా అమ్మ ఇలాగే చేసేది. వారంపాటు క్రమం తప్పకుండా ఈ ఫేషియల్ చేస్తే ముఖంపై ఉన్న ముడుతలు, గీతలు తొలగించి చర్మాన్ని హైడ్రేట్ చేసి ప్రకాశవంతంగా మారుస్తుంది. హైపర్‌పిగ్మెంటేషన్ ఉన్న చోట అరటి తొక్కతో రుద్దుతూ ఉంటే బొటాక్స్ కంటే సమర్థంగా పనిచేస్తుందని " చెప్తుంది. మరో ఇన్‌స్టా వీడియోలోనూ ఒక విదేశీయురాలు 'అరటిపండు తొక్క ఫేషియల్ బొటాక్స్ కంటే బెటర్' అంటూ ప్రచారం చేయడం చూడవచ్చు. ఈ టాపిక్‌పై ఇలాగే ఎంతో మంది సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేస్తున్నారు.

**బొటాక్స్ అంటే..**


బొటులీనియం టాక్సిన్ అనే ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా ముఖంపై ఉన్న కండరాలకు నరాలు సంకేతం ఇవ్వకుండా తాత్కాలికంగా నిరోధించవచ్చు. అందువల్ల ముఖంలో ముడుతలు, కళ్ల కింద వలయాలు తగ్గి చర్మం బిగుతుగా, కాంతివంతంగా మారుతుంది. దీని ప్రభావం 3-6 నెలల వరకూ మాత్రమే ఉంటుంది. ఏ భాగంలో తీసుకుంటున్నాం అన్నదాన్ని బట్టి ట్రీట్‌మెంట్ ధర రూ. 5000-25000 మధ్య ఉంటుంది. ఈ విధానం సురక్షితమైనదేనని, నిపుణులైన వారి దగ్గర ట్రీట్‌మెంట్ తీసుకుంటే ఎలాంటి సమస్యలు రావని వైద్యులు సూచిస్తున్నారు.

**అరటితొక్క ఫేషియల్ బొటాక్స్‌లా పనిచేస్తుందా..**

అరటిపండు తొక్కలలో పాలీఫెనాల్స్, విటమిన్లు (%ూ, దీ, జ, జు%), యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి, ఇవి తేలికపాటి తాత్కాలిక చర్మ ప్రయోజనాలను అందిస్తాయే తప్ప బొటాక్స్‌లా ముడుతలు తగ్గించినట్లు ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు లేవని డెర్మటాలజిస్టులు చెబుతున్నారు. లైకులు, షేర్ల కోసం ఫిల్టర్లు వాడి ఇన్‌ఫ్లుయెన్సర్లు రూపొందించిన వీడియోలు నమ్మవద్దని సూచిస్తున్నారు. రసాయనాలతో పండించిన అరటి పండు తొక్కలతో ఫేషియల్ చేసుకోవడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు. కాబట్టి, వీటిని ముఖంపై రుద్దితే పురుగుల మందులు అవశేషాలు నేరుగా చర్మలోకి చికాకులు, అలర్జీలు, దీర్ఘకాలిక సమస్యలు తెచ్చిపెట్టే ప్రమాదముంది.

## హెచ్‌ఎంపీవీ మొదట ఏ అవయవాన్ని ప్రభావితం చేస్తుంది

హెచ్‌ఎంపీవీ వేగంగా వ్యాప్తి చెందుతుండటంతో ప్రపంచంలోని దేశాలు ఆందోళన చెందుతున్నాయి. కోవిడ్ -19 తర్వాత, చైనాలో వందలాది మందిని ఇబ్బంది పెట్టిన హ్యూమన్ మెటాప్‌న్యూమోవైరస్ హెచ్‌ఎంపీవీ ,క్రమంగా ఇతర దేశాలలో వ్యాప్తి చెందుతోంది. భారత్‌లో ఇప్పటి వరకు 5 వైరస్ కేసులు నమోదయ్యాయి. బెంగళూరు, అహ్మదాబాద్‌తోపాటు తమిళనాడులోని పలు ప్రాంతాల్లో ఈ కేసులు నమోదయ్యాయి. అయితే, హెచ్‌ఎంపీవీ మొదట ఏ అవయవాన్ని ప్రభావితం చేస్తుంది? శరీరంలో ఎలాంటి మార్పులు సంభవిస్తాయి? అనే విషయాలను తెలుసుకుందాం..



**ఏ అవయవాన్ని ప్రభావితం చేస్తుంది?**

ఈ వైరస్ ముందుగా ఊపిరితిత్తులు, శ్వాసనాళాలను లక్ష్యంగా చేసుకుంటుంది. ఈ ఇన్ఫెక్షన్ శ్వాసకోశ వ్యవస్థ యొక్క కణాలను దెబ్బతీస్తుంది. ఇది శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిని కలిగించడంతోపాటు, దగ్గు, అనేక ఇతర సమస్యలను కలిగిస్తుంది. ఈ ఇన్ఫెక్షన్ బలహీనమైన రోగనిరోధక శక్తి ఉన్నవారిలో, చిన్న పిల్లలు, వృద్ధులలో వేగంగా వ్యాపించి తీవ్రమైన శ్వాసకోశ వ్యాధికి కారణమవుతుంది.

**శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది:**

వైరస్ శ్వాసకోశ వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. ఇది శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిని కలిగిస్తుంది. చిన్న పిల్లల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది.

**అధిక జ్వరం, అలసట:**

ఇన్ఫెక్షన్ ప్రారంభంలో, ఒక వ్యక్తికి అధిక జ్వరం, తలనొప్పి, శరీరంలో బలహీనత అనిపిస్తుంది.

**గొంతు నొప్పి, కఫం:**

%ఎవీూఎ% గొంతును కూడా ప్రభావితం చేస్తుంది. దీని వలన గొంతు నొప్పి, పొడి దగ్గు, కఫం వస్తుంది.

**శ్వాసకోశ సమస్యలు:**

వైరస్ ముదిరే కొద్దీ బ్రోన్కైటిస్, న్యుమోనియా, వాయుమార్గ అవరోధం వంటి తీవ్రమైన సమస్యలు ఏర్పడతాయి.

**శరీరంలో ఆక్సిజన్ లేకపోవడం:**


తీవ్రమైన సందర్భాల్లో, శరీరంలో ఆక్సిజన్ స్థాయి పడిపోవచ్చు, ఇది హైపోక్సియాకు దారితీస్తుంది.

**ఎలా రక్షించాలి?**

నిపుణుల అభిప్రాయం ప్రకారం, హెచ్‌ఎంపీవీ నుండి రక్షించడానికి, పరిశుభ్రతను పాటించాలి. రద్దీగా ఉండే ప్రదేశాలను నివారించాలి. రోగనిరోధక శక్తిని బలంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. చిన్న పిల్లలు, వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేదా ఇతర లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

## టీ తాగిన వెంటనే ఈ తప్పులు అస్సలు చేయవద్దు

టీ అంటే చాలా మందికి ఇష్టం. మన భారతీయులు ఎక్కువగా దీనిని తీసుకుంటారు. నిద్రలేవగానే కొందరికి టీ ఉండాల్సిందే. మరి కొందరు రోజుకి నాలుగైదు సార్లు టీ తాగుతూనే ఉంటారు. ఇంకొందరు ఫుడ్ తీసుకున్నాక కూడా దీనిని తాగుతారు. మరికొందరు టీ తాగిన వెంటనే ఏవైనా స్నాక్స్ అలా తీసుకుంటారు. హెర్బల్ టీ, అల్లం టీ, మందార టీ, గ్రీన్ టీ, బ్లాక్ టీ అంటూ టీలో చాలా రకాలున్నాయి. అయితే, టీ తాగిన తర్వాత ఈ ఫుడ్ ఐటెమ్స్ అస్సలు తినకూడదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పొరపాటున వీటిని తీసుకుంటే ఆరోగ్య సమస్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.



1. ఉల్లిపాయలు:

చాలా మంది భోజనం తిన్న తర్వాత టీ తాగే అలవాటు ఉంటుంది. అయితే, కొందరు ఉల్లిపాయలను టీతో కలిపి తాగుతుంటారు. అయితే, ఇలా తాగడం వల్ల ఆరోగ్యం దెబ్బతినే అవకావం ఉంటుంది. గుడ్డు, మొలకెత్తిన గింజలు, సలాడ్ లను టీతో అస్సలు తీసుకోవద్దు.

2. నిమ్మకాయ:

టీలో నిమ్మరసం కలపకూడదు. అలా చేస్తే ఎసిడిటీ, డయేరియా వంటి ఆరోగ్య సమస్యలు మొదలవుతాయి. కాబట్టి, టీతో పాటు నిమ్మకాయను అస్సలు తీసుకోకండి. టీ తాగిన వెంటనే నిమ్మరసం తీసుకునే అలవాటు ఉంటే వెంటనే మానుకోవడం మంచిది.

3. ఉప్పు, కారం:

టీలో ఉప్పు, కారం, పకోడీ వంటివి తినే అలవాటు చాలా మందికి ఉంటుంది. అయితే, ఈ పద్ధతి ఆరోగ్యానికి హానికరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

4. మొక్కజొన్న పిండి:

మొక్కజొన్న పిండిని టీతో కలిపి తినడం కూడా హానికరమని నిపుణులు అంటున్నారు. ఎందుకంటే శరీరంలో పోషకాల కొరత ఏర్పడుతుందని చెబుతున్నారు.

5. పసుపు:

పసుపుతో చేసిన ఉత్పత్తులను టీతో తినడం ఆరోగ్యానికి మంచిది కాదు. ఎందుకంటే టీ, పసుపులో ఉండే రసాయన సమ్మేళనాలు కడుపు సమస్యలు తెస్తాయి. అంతేకాకుండా జీర్ణక్రియను దెబ్బతీస్తాయి. కాబట్టి టీతో కానీ టీ తాగిన వెంటనే కానీ పసుపుతో చేసిన ఉత్పత్తులను తీసుకోకండి.

6. నీరు తాగవద్దు:

టీ తాగిన వెంటనే ఎలాంటి చల్లని వస్తువులు తీసుకోవద్దు. ఇంకా నీరు తాగడం ఆరోగ్యానికి మంచిది కాదు. ఇలా చేస్తే దంతాల సమస్యలు వస్తాయి. అంతేకాకుండా ఇది జీర్ణక్రియను ప్రభావితం చేయడంతోపాటు ఎసిడిటీ, గ్యాస్ వంటి సమస్యలను కలిగిస్తుంది. మీకు దాహం వేస్తే, టీకి ముందు నీరు తాగడం మంచిది.

## బ్రోకలీ ప్రయోజనాలు తెలిస్తే అస్సలు వదిలిపెట్టరు.

బ్రోకలీ ఆరోగ్యానికి ఎంతో మంచిది. అయితే, చాలా మందికి ఇదేంటో తెలియదు. బ్రోకలీ అనేది మంచి పోషకమైన ఆకుకూర. కొలెస్ట్రాల్‌ను తగ్గించడం నుంచి బరువు తగ్గించడం వరకు ఎంతగానో సహాయపడుతుంది. బ్రోకలీలో మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. దీనిలోని విటమిన్లు సి, కె, ఎ, పొటాషియం, ఆరోగ్యకరమైన రోగనిరోధక వ్యవస్థకు సహాయపడుతాయి. అంతేకాకుండా చర్మం, ఎముకలు ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. జీర్ణక్రియను నియంత్రించడంలోనూ సహాయపడుతాయి.



**దీర్ఘకాలిక వ్యాధులకు:**

బ్రోకలిలో శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. క్యాన్సర్, గుండె జబ్బులు వంటి దీర్ఘకాలిక వ్యాధుల నుండి రక్షించడంలో ఈ కూరగాయలోని ఫ్లేవనాయిడ్స్, సల్ఫోరాఫేన్ అనే సమ్మేళనాలు ఎంతగానో సహాయపడతాయి.

**కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గడానికి..**

బ్రోకలీ కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో బాగా సహాయపడుతుంది. దీనిలోని ఫైబర్ జీర్ణవ్యవస్థలోని కొలెస్ట్రాల్‌ను బంధించి శరీరం నుంచి తొలగించడానికి ఉపయోగపడుతంది. రక్తంలో మొత్తం కొలెస్ట్రాల్ ను తగ్గించడంలోనూ సహాయపడుతుంది. అంతేకాకుండా గుండె జబ్బుల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. బ్రోకలీలోని ఫైబర్ జీర్ణక్రియ, కార్బోహైడ్రేట్ల శోషణను నెమ్మదించడానికి సహాయపడుతుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా నిరోధించడంలో ఉపయోగపడుతుంది.

**బరువు తగ్గడానికి..**

బ్రోకలీ బరువు తగ్గడానికి కూడా తోడ్పడుతుంది. దీనిలో తక్కువ కేలరీలు, ఎక్కువ ఫైబర్ ఉంటుంది. ఇది తినే కేలరీల సంఖ్యను తగ్గించడంలో సహాయపడుతుంది.